ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

సోమవారం 18 ఆగస్టు 2025

పీఎన్‌బీఎస్ కిటకిట





వరుస సెలవులు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నేపథ్యంలో విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆదివారం కిటకిటలాడింది. వేలాదిగా ప్రయాణికులు రావడంతో బస్టాండ్‌తో పాటు సిటీ బస్ పోర్టు కిక్కిరిసింది. ప్లాట్‌ఫాంపైకి బస్సు వచ్చే వరకు ఆగకుండానే బస్సు ఎక్కేందుకు పోటీ పడటంతో తోపులాటలు జరిగాయి. సాధారణ రోజుల్లో మాదిరిగానే సమయానుకూలంగా ఉన్న బస్సులు చాలకపోవడంతో చిన్నారులు, వృద్ధులతో సహా ప్రయాణికులు ప్లాట్‌ఫాంపైనే పడిగాపులు పడ్డారు.

- (ఆంధ్రజ్యోతి-విజయవాడ సిటీ)

6

బార్‌లు @ 183



ఎన్టీఆర్ జిల్లాలో 140... కృష్ణాజిల్లాలో 43 ఏర్పాటు

గీత కార్మికులకు 14 బార్‌ల కేటాయింపు

- 20న గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- గీత కార్మికుల దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు 29
- ఓపెన్ కేటగిరి బార్ దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు 26



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయబోయే బార్‌ల లెక్కను ఎక్సైజ్ అధికారులు తేల్చారు. ప్రస్తుతం ఉన్న బార్‌ల లైసెన్స్ గడువు ఈనెలాఖరుతో ముగియడంతో కొత్త విధానం ప్రకారం బార్‌లకు అనుమతులు మిగతా 6లో..

దరఖాస్తులు ఇలా..

బార్‌ల లైసెన్స్‌లను పొందాలనుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. దీంతోపాటు విజయవాడ, మచిలీపట్నంలోని ఈఎస్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. అదే రోజున జిల్లా ఎక్సైజ్ అధికారులు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఓపెన్ కేటగిరీలో బార్‌లకు దరఖాస్తులు చేసుకునే వారికి 26వ తేదీ సాయంత్ర ఐదు గంటలకు తుది గడువు. ఆ బార్‌లకు 28వ తేదీన లాటరీ తీస్తారు. గీత కార్మికుల కోటాలో దరఖాస్తులు చేసుకునే వారికి 29వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు తుది గడువు. 30వ తేదీన లాటరీ ద్వారా బార్‌లను కేటాయిస్తారు. అభ్యర్థులు దరఖాస్తుగా రూ.10వేలు, డిపాజిట్‌గా రూ.5లక్షలు చెల్లించాలి. ఇందులో రూ.5లక్షలకు వాపసు ఉండదని అధికారులు తెలిపారు.

ప్రగతి పరుగులు

అసమాన వృద్ధి దిశగా ఎన్టీఆర్ జిల్లా

తొలి అర్ధ సంవత్సరంలోనే గతేడాది జీడీపీ దాటివేత

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా ఘనమైన ఆరంభాన్ని ఇచ్చింది. అసమాన వృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. తొలి అర్ధసంవత్సరంలోనే గతేడాది జీడీడీపీని దాటేసింది. రాష్ట్ర ఆర్థికవృద్ధిలో కీలక పాత్ర పోషించే దిశగా అడుగులు వేస్తోంది. తలసరి ఆదాయం కూడా భారీగా పెరిగింది. నియోజకవర్గాల వారీగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో విశేష వృద్ధిని సాధించింది. ఈ ఏడాది సేవా రంగంలో ఎన్టీఆర్ జిల్లా దూసుకుపోతోంది. సేవా రంగాల్లో ఐటీ, కమ్యూనికేషన్స్, ఆతిథ్య రంగాలు ప్రధానంగా ఉన్నాయి. వీటి మీద ప్రత్యేక దృష్టి సారిస్తే మరింత వృద్ధి నమోదవుతుంది.

- ప్రస్తుత జీడీడీపీ రూ. 1,12,057 కోట్లుగా నమోదు
- రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర!
- తలసరి ఆదాయం పెరుగుదల రూ.4,17,412

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జీడీడీపీ)లో ఎన్టీఆర్ జిల్లా దూసుకుపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా 2025- 26 ఆర్థిక సంవత్సరాన్ని ఘనంగా ఆరంభించింది. జిల్లా స్థూల దేశీయ ఉత్పత్తి ప్రస్తుత నెలకు చూస్తే రూ. 1,12,057 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో ఇదే జీడీడీపీ రూ.94,561 కోట్లుగా ఉంది. ఆర్థిక సంవత్సరం ముగియటానికి ఇంకా చాలా నెలలు ఉంది. తొలి అర్ధ సంవత్సరం ముగియటానికి మరో రెండు నెలల సమయం ఉంది. రెండవ అర్ధ సంవత్సరం ఇంకా మిగిలే ఉంది. దీనిని బట్టి చూస్తే ఈ ఏడాది రాష్ట్ర వృద్ధిలో ఎన్టీఆర్ జిల్లా గణనీయమైన పాత్ర పోషించబోతున్నట్టు అర్థమవుతోంది. ఎన్టీఆర్ జిల్లా తలసరి ఆదాయం కూడా బాగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ. 4,17,412లుగా తలసరి ఆదాయం ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ. 3,53,150లు మాత్రమే ఉంది. ఈ వృద్ధిని మరింత ముందుకు తీసుకువెళ్లటానికి వీలుగా నియోజకవర్గాల స్థాయిలో ప్రభుత్వం తరఫున చేపట్టవలసిన ప్రణాళికలను కూడా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం రూపొందించింది. వ్యవసాయ, పరిశ్రమలు, సేవా రంగాలను బలోపేతం చేసే ప్రాజెక్టులను ప్రతిపాదిస్తోంది.



మూడు ప్రధాన రంగాల్లో వృద్ధి

వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో ఎన్టీఆర్ జిల్లా గణనీయంగా అభివృద్ధి చెందింది. అన్ని రంగాల్లో కూడా స్థూల విలువ జోడింపు (జీవీఏ) పెరిగింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రూ.12,632 కోట్లు వృద్ధి సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.10,895 కోట్లు జీవీఏ సాధించింది. పరిశ్రమల రంగంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి రూ. 21,021 కోట్లు జీవీఏ సొంతం చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.17,728 కోట్లు మాత్రమే జీవీఏ సాధించింది. సేవా రంగంలో ఈ ఆర్థిక సంవత్సరం అత్యధికంగా రూ.69,220 కోట్ల జీవీఏ సొంతం చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.58,628 కోట్ల ఆదాయం సాధించింది. తొలి అర్ధసంవత్సరం లోపే మూడు ప్రధాన రంగాల్లో స్పష్టమైన వృద్ధిని సాధించింది.

నియోజకవర్గాల వారీగా ప్రగతి

జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు, విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాల వారీగా సాధించిన వృద్ధి గణాంకాలను కూడా ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం సమర్పించింది. తిరువూరు నియోజకవర్గంలో వ్యవసాయ రంగంలో రూ.4,110 కోట్లు, పరిశ్రమల రంగంలో రూ.2,487 కోట్లు, సేవా రంగంలో రూ.4,705 కోట్ల జీవీఏ సాధించగా.. రూ.3,97,140 తలసరి ఆదాయాన్ని పొందింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వ్యవసాయ, పరిశ్రమలు, సేవా రంగాల్లో రూ.42 కోట్లు, రూ. 2,406 కోట్లు, రూ.16,979 కోట్లు ఆదాయం లభించగా, రూ.4,65,241 తలసరి ఆదాయం ఉంది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వరుసగా రూ.141 కోట్లు, రూ.2,858 కోట్లు, రూ.13,809 కోట్ల జీవీఏ సాధించగా, రూ.3,98,657 తలసరి మిగతా 6లో..

రేపూడితండాలో వైద్య శిబిరాల ఏర్పాటు

సందర్శించిన జిల్లా మలేరియా అధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి మోతిబాబు

ఎ.కొండూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రేపూడితండాలో విష జ్వరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లా మిగతా 6లో..

5,465 బంగారు కుటుంబాలకు మార్గదర్శి కృష్ణామిల్క్ యూనియన్

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

6

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఇ-ప్రొక్యూర్ మెంట్ టెండరు నోటీసు - 2 వ పిలుపు

ఇ - ప్రొక్యూర్ మెంట్ ద్వారా శ్రీ గంగా భ్రమరాంబిక సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయము, కొణతాలపల్లి గ్రామము, వీరులపాడు మండలం, ఎన్.టి.ఆర్.జిల్లా నందు దేవాలయమును పునర్ నిర్మించుటకు రూ. 92.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

ఇట్లు : కార్యనిర్వహణాధికారి

బుడమేరు.. అదే తీరు!



కాలువలో గుర్రపుడెక్క తొలగించని ఇరిగేషన్‌శాఖ

- ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం మానని స్థానికులు
- బుడమేరులో ముందుకు కదలని ప్రవాహం
- సమస్యపై స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ
- కార్పొరేషన్ కమిషనర్‌కు బాధ్యతల అప్పగింత
- డ్రోన్ క్యాప్చరింగ్ చేయించిన కమిషనర్ ధ్యానచంద్ర
- రామవరప్పాడులో ఎస్ఎల్‌వీ దగ్గర భారీగా గుర్రపు డెక్క ప్లాస్టిక్ వ్యర్థాలు
- భారీ యంత్రాలతో తొలగింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మానవ, ప్రభుత్వ శాఖల తప్పిదాలు బుడమేరుకు శాపంగా మారుతున్నాయి. వర్షాకాలం వస్తుందని తెలిసి కూడా బుడమేరులో కనీసం తూటికాడ కూడా తొలగించటానికి ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఫలితంగా విజయవాడ నగరం, శివారు ప్రాంతాలలో కురిసిన వర్షానికే నగర పరిధిలో బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనికి కారణం.. గుర్రపు డెక్క తొలగించకపోవటమే. గుర్రపుడెక్క బుడమేరు ప్రవాహానికి అడ్డు పడుతోంది. దీంతో బుడమేరులో వరద కదలక నిండుకుండలా మారిపోతోంది. గుర్రపు డెక్కతో పాటు నగర ప్రజల తప్పిదం వల్ల కూడా బుడమేరు ప్రవాహం దిగువకు పారటానికి ఇబ్బంది తలెత్తుతోంది. గతేడాది ఇదే రోజుల్లో బుడమేరు చూపించిన విలయాన్ని చూసి కూడా నగర మిగతా 6లో..

హెచ్చుతగ్గుల వరద

ప్రకాశం బ్యారేజీ ఇన్‌ఫ్లో 2.42 లక్షల క్యూసెక్కులు

- అవుట్‌ఫ్లో 2.82 లక్షల క్యూసెక్కులు
- పులిచింతల ఇన్‌ఫ్లో 2.08 లక్షల క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 1.96 లక్షల క్యూసెక్కులు



విజయవాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీలకు హెచ్చుతగ్గుల మధ్య వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి ఉదయం ఆరు గంటలకు 2,52,034 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 2,50,072 క్యూసెక్కులుగా మిగతా 6లో..

కూలిన రిటైనింగ్ వాల్

- తప్పిన ప్రమాదం.. పెంకుటిల్లు పాక్షికంగా ధ్వంసం

6

కొరత సృష్టిస్తే కఠిన చర్యలే

- ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద కంట్రోల్‌రూం నెంబర్
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

बैंक ऑफ़ इंडिया BOI బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ శాఖ

10-1-1199/2, PTI బిల్డింగ్, 3వ అంతస్తు, A.C. గార్డ్స్, హైదరాబాద్-500004, ఫోన్: 7981022210, 9505544515, ఇ-మెయిల్ : AssetrecoveryBranch.Telangana@bankofindia.co.in

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8 (6) మరియు 9(1)తో చదువబడే SARFAESI చట్టం, 2002 క్రింద సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన

SARFAESI చట్టం, 2002 మరియు అందులో రూపొందించబడిన నియమాల క్రింద ఈ అమ్మకం ప్రకటన జారీ చేయడానికి మరియు అమ్మకం యొక్క అన్ని హక్కులను వినియోగించుకొనుటకు బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు పూర్తి హక్కులు కలిగి ఉన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/చార్జ్ చేసిన, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే నిర్మాణాత్మక / భౌతిక స్వాధీనం చేసుకొనబడినట్టి దిగువ వివరించబడిన స్థిరాస్తులు దిగువ వివరించబడిన రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన దిగువ వివరించబడిన బకాయిలను రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు "అక్కడ ఉన్నది ఉన్నట్లు" ప్రాతిపదికన 26.09.2025 తేదీన ఇ-వేలం ద్వారా విక్రయించబడునని మీకు / రుణగ్రహీతలకు / హామీదారులకు / తనఖాదారులకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

1) సాధారణ ప్రజానీకం మరియు ఆసక్తిగల కొనుగోలుదారులు ఏదేని ఆస్తి కొనుగోలుకు సంబంధించి బిడ్‌లో పాల్గొనుటకు ఏదేని విచారణ కొరకు మరియు ఇందుకు సంబంధించి అన్ని ఇతర విషయాల కొరకు (నియమ నిబంధనలో తెలిపిన విధంగా వారి ఆన్‌లైన్ బిడ్ దాఖలు చేయుట మినహా) లేదా ఏదేని విచారణ వివరాలు పొందుటకు పైన తెలిపిన శాఖను సంప్రదించవలసినదిగా సూచించబడుచున్నారు. 2) మూడవ పార్టీలకు చెల్లించవలసిన ఏదేని దాని కొరకు లేదా ఇందుకు సంబంధించి ఏదేని మూడవ పార్టీతో సాధారణ ప్రజానీకం ఆసక్తిగల కొనుగోలుదారులు/ ఏవేని చర్యలు/వ్యవహారాలు జరిపితే దానికి బ్యాంక్ ఎలాంటి బాధ్యత వహించదు/ జవాబుదారీ కాదు అని సాధారణ ప్రజానీకం/ ఆసక్తిగల కొనుగోలుదారులను హెచ్చరించడమైనది. అది వారి సొంత బాధ్యత మరియు వ్యయ ప్రయాసలపై నిర్వహించకొనవచ్చును. 3) బిడ్డింగ్ ప్రాసెసింగ్ కోట్ చేసిన వారి అంతిమ బిడ్ మొత్తాన్ని మాత్రమే బ్యాంకుకు ఆస్తి యొక్క సఫలీకృత బిడ్డరుచే మొత్తం చెల్లించబడాలని కూడా తెలియజేయడమైనది (నియమ నిబంధనల ప్రకారం) + వర్తించు పన్నులు (అమ్మకం సర్టిఫికెట్ నమోదు నిమిత్తం TDS, స్టాంపు సుంకం, చార్జీలు/ఫీజులు బిడ్డరుచే విడిగా చెల్లించబడాలి). 4) ఏదేని SRO వద్ద ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బ్యాంక్‌కు తెలియని ఏదేని నిషేదం ఉన్నదేమోనని ఆస్తి నమోదు గురించి తమకుతాము కొనుగోలుదారులు సంతృప్తి చెందవలెను. 5) కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసే ముందు ఆస్తిపై ఏవేని చట్టబద్ధమైన / ప్రభుత్వ / మునిసిపాలిటీ క్లెయిమ్‌లు అనగా ఆస్తి పన్ను, ఎలక్ట్రిసిటీ, వాటర్, వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణ బకాయిలు లేదా ఏవేని ఇతర బకాయిలు మొదలగు వాటి గురించి వివరాలు పొందవలెను మరియు తమకుతాము సంతృప్తి చెందవలెను. 6) సదరు ఇ-వేలం ఆస్తి / ఆస్తులకు సంబంధించి భవిష్యత్‌లో ఏవేని వ్యాజ్యాలు ఎదురయ్యే విషయంలో సదరు వేలం అట్టి వ్యాజ్యం ఫలితానికి లోబడి ఉంటుందని కాగోరు బిడ్డర్లు గమనించవలెను. 7) కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసే ముందు సరియైన / స్వతంత్ర విచారణ చేసుకోవలెను.

అమ్మకం తేది & సమయం : 26.09.2025 న ఉ. 11.00 గం. నుంచి సా. 5.00 గం. వరకు (అమ్మకం ముగిసే వరకు బహుళ విస్తరణలతో)

క్ర.సం.	రుణగ్రహీతలు మరియు హామీదారుల పేర్లతో పాటు మిగులు బకాయి వివరాలు
1.	**M/s. క్రోసోల్ క్రాప్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్.,** 117/1వ అంతస్తు, ఈస్ట్ వింగ్, బ్లాక్-2, లైఫ్‌స్టైల్ ప్రక్కన, బేగంపేట, హైదరాబాద్ - 500016, **M/s. క్రోసోల్ క్రాప్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్.,** డి.నం.16-130/12, సర్వే నం.183/1, అసెస్‌మెంట్ నం.1006, 3వ క్రాస్ ఎక్స్‌టెన్షన్, ఆటోనగర్, జెఆర్‌డి టాటా ఇండస్ట్రీయల్ ఏరియా, కానూరు పెనమలూరు మండలం, విజయవాడ, కృష్ణా జిల్లా - 520007, **శ్రీ నవీన్ బెలిదె, తండ్రి స్వర్గీయ బి.కామేశ్వరరావు,** 403, లెజెండ్ అపార్ట్‌మెంట్, రేణుకా ఎన్‌క్లేవ్, రాజ్‌భవన్ రోడ్, హైదరాబాద్ - 500082, **శ్రీమతి బెలిదె ఉమారాణి, భర్త బెలిదె నవీన్,** ఫ్లాట్ నం.403, లెజెండ్ అపార్ట్‌మెంట్, రేణుకా ఎన్‌క్లేవ్, సోమాజిగూడ, రాజ్‌భవన్ రోడ్, హైదరాబాద్ - 500082, **శ్రీ బెలిదె రాజేందర్, తండ్రి శ్రీ బెలిదె కామేశ్వరరావు,** డి.నం.9-9-84, గిర్మాజి పేట, వరంగల్ - 506002, తెలంగాణ, **శ్రీమతి బెలిదె విజయలక్ష్మి అలియాస్ బెలిదె లక్ష్మి,** డి.నం.9-9-84, గిర్మాజి పేట, వరంగల్ - 506002, తెలంగాణ, - **బకాయి మొత్తం: రూ.11,03,29,796.19** ప్లస్ చెల్లించిన ఏవైనా మొత్తాలు తగ్గించుకుని వ్యయాలు, ఖర్చులు వగైరా కలుపుకుని 30.06.2017 నుండి కాంట్రాక్చువల్ రేట్ వంతున వడ్డీ.
	ఆస్తి వివరణ: M/s. క్రోసోల్ క్రాప్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్., (గతంలో మెస్సర్స్ హేమశ్రీ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, 22.09.2015 నుండి కంపెనీ పేరు మారినది) పేరున పటమట సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలో ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామపంచాయతీ పరిధిలో జెఆర్‌డి డోర్ నం.16-130/12, అసెస్‌మెంట్ నం.1006, రీ సర్వే నం.183/1 గల ఆంధ్రప్రదేశ్, విజయవాడ, జెఆర్‌డి టాటా ఇండస్ట్రీయల్ ఏరియా కానూరు, ఆటోనగర్, 3వ క్రాస్ ఎక్స్‌టెన్షన్ వద్ద ఎ.సి షీట్ సెట్స్ మరియు గ్రౌండ్, మొదటి & రెండవ అంతస్తులు గల ఆర్‌సిసి భవనంతో ఇండస్ట్రీయల్ సైట్ యొక్క 1546.02 చ.మీ.లకు సమానముగు 1849.028 చ.గజాల విస్తీర్ణం ఆస్తి యావత్తు. **సరిహద్దులు:- ఉత్తరం:** ఎర్రపోతు రాజారావు & అలపతి రత్నప్రసాద్‌కు చెందిన ఆస్తి, **దక్షిణం:** శ్రీ వీరమాచినేని వెంకటరత్నంకు చెందిన ఆస్తి, **తూర్పు:** రోడ్డు, **పశ్చిమం:** కొంత విస్తీర్ణం శ్రీమతి ఎలమంచిలి భారతికి చెందిన ఆస్తి & కొంత విస్తీర్ణం 40 అ.వెడల్పు రోడ్డు. **MOD:** 9475/2015 తేది 28.08.2015; **SRO:** విజయవాడ; సేల్ డీడ్ డాక్యుమెంట్ నం: 8512/2015 తేది 24.01.2015, **SRO:** విజయవాడ; స్వాధీనం: భౌతిక
	రిజర్వు ధర : రూ.758.00 లక్షలు — **బయానా : రూ.75.80 లక్షలు** — **బిడ్ పెరుగుదల మొత్తం: రూ.1.00 లక్ష**

నియమ నిబంధనలు: 1) ఆస్తి వివరాలు చూడడానికి https://baanknet.com/eauction-psb/x-login దర్శించండి. 2) వెబ్‌సైట్ https://baanknet.com/ eauction-psb/x-login ద్వారా 'ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్' ప్రక్రియ ద్వారా మాత్రమే వేలం అమ్మకం / బిడ్డింగ్ ఉంటుంది. 3) కాగోరు బిడ్డర్లు పోర్టల్ https://baanknet.com/eauction-psb/bidder-registration లో తమ పేర్లను వన్‌టైమ్ రిజిస్టర్ చేసుకొని యూజర్ ఐడీ మరియు పాస్‌వర్డ్ పొందవలెను. సదరు పోర్టల్‌లో ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు వారు అప్పుడు అనుమతించబడతారు. బయానా వారి వాలెట్‌కు డిపాజిట్ చేయబడాలి. 4) ఏ సమయంలోనైనా కనీసం మొదటి బిడ్ పెంపుదల మొత్తం కంటే మీ బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే ఎక్కువగా ఉండాలి మరియు బిడ్లు పైన తెలిపిన పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దాఖలు చేయాలి మరియు బిడ్డరు ఇ-వేలంలో పాల్గొనుటకు బయానా కొరకు వారి వాలెట్‌లో తగిన బ్యాలెన్స్‌ను కలిగియుండవలెను. 5) కాగోరు బిడ్డర్లు ఇ-వేలంలో నమోదు కొరకు మరియు పాల్గొనుట చెల్లుబాటగు ఇ-మెయిల్ చిరునామా & మొబైల్ నం. కలిగి ఉండవలెను. 6) బిడ్డర్లు ఇ-వేలం అమ్మకంలో వారి బిడ్లు దాఖలు చేయుటకు మరియు పాల్గొనే ముందు ఇ-వేలం అమ్మకం సవివర నియమ నిబంధనల కొరకు మా వెబ్‌సైట్ https://bankofindia.co.in/Tender దర్శించవలసిందిగా సూచించబడుతున్నారు. 7) సెక్యూర్డ్ క్రెడిటార్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ https://baanknet.com/eauction-psb/home లో ఏర్పాటు చేయబడిన నియమ నిబంధనలకు లోబడి అమ్మకం ఉంటుంది. 8) సంబంధిత శాఖ యొక్క ముందస్తు అనుమతితో ఆస్తిని తనిఖీ చేసుకొనవచ్చును. సంప్రదించాల్సిన వారి వివరాలు పైన పొందుపర్చబడినవి. 9) అమ్మకం క్రింద కొనుగోలుదారులకు ఏవేని భూములను డీమార్కేట్ చేయడానికి బ్యాంకు బాధ్యత వహించదు.

గమనిక: సఫలీకృత బిడ్డర్లు బయానాతో కలుపుకొని అమ్మకం ధరలో 25% అమ్మకం యొక్క అదే రోజున లేదా మరుసటి పని రోజుకు మించకుండా చెల్లించవలెను మరియు అమ్మకం ధరలో మిగిలిన మొత్తాన్ని వారికి అమ్మకం తెలియజేయబడిన యొక్క అంగీకారం / నిర్ధారణ నుండి 15 రోజులలోగా చెల్లించవలెను. పైన పేర్కొన్న నిర్దేశిత గడువులోగా మొత్తంలో 25% మొత్తాన్ని లేదా మిగతా మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనచో, అమ్మకం రద్దు చేయబడును మరియు ఈ బిడ్‌కు సంబంధించి బిడ్డర్లచే డిపాజిట్ చేయబడిన మొత్తం బిడ్డర్లకు ఎలాంటి తదుపరి నోటీసు లేకుండా జప్తు చేసుకోబడును. ఈ విషయంలో బిడ్డర్ల ఆస్తికి సంబంధించి లేదా అందులో భాగానికి అన్ని క్లెయిమ్‌లు వదులుకోవలసి ఉంటుంది. తదుపరిగా ఆస్తి విక్రయించబడును మరియు సఫలీకృత బిడ్డర్‌కు ఎలాంటి వడ్డీ చెల్లించబడదు మరియు తదుపరిగా ఎట్టి పరిస్థితులలోను బిడ్డర్లచే వడ్డీ చెల్లింపు కొరకు ఎలాంటి క్లెయిం చేయబడదు.

తేది: 12.08.2025, ప్రదేశం : హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా



దసరా ఉత్సవాల నమూనా క్యూలను పరిశీలిస్తున్న ఈవో

గత ఏడాదికి భిన్నంగా..

దుర్గగుడిలో దసరా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు 11 రోజులుపాటు జరగనున్న దసరా ఉత్సవాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. దసరా ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. సీవీ రెడ్డి ఛారిటీస్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన నమూనా క్యూలను పరిశీలించి, కొన్ని మార్పులను సూచించారు. భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి గతం కంటే భిన్నంగా, అధునాతనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో తెలిపారు. ఉత్సవాల్లో రోజుకు 65 వేల నుంచి 80 వేలమంది, మూలానక్షత్రం రోజున 2 నుంచి 3 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా ఉండగా, వన్‌టౌన్ వినాయకుడి గుడి నుంచి కొండపైకి దర్శన క్యూ నిర్మాణంలో మార్పుచేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ బి.రాంబాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీ రెడ్డి, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్ల, వీరులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కోగంటి సత్యనారాయణను సత్కరిస్తున్న బుద్దా వెంకన్న

కోగంటి బాబును కలిసిన బుద్దా వెంకన్న

వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కంచకచర్ల, వీరులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోగంటి సత్యనారాయణ (బాబు)ను ఆయన స్వగ్రామం పరిటాలలోని ఆయన నివాసంలో ఆదివారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న కోగంటి బాబును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు కోగంటి రామారావు, మండలనేతలు పాల్గొన్నారు.



ఇళ్లపైకి జారిపడిన రిటైనింగ్ వాల్

కూలిన రిటైనింగ్ వాల్

- తప్పిన ప్రమాదం.. పెంకుటిల్లు పాక్షికంగా ధ్వంసం

చిట్టినగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు ప్రైజర్‌పేట పెద్దిరాజుల వీధిలో ఆదివారం రిటైనింగ్ వాల్ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వాల్ దిగువున ఉన్న రేకులషెడ్, పెంకుటిల్లుపై పడటంతో అవి పాక్షికంగా ధ్వంసమయ్యాయి. కొండప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నా పాలకులకు పట్టడంలేదని సీపీఎం ఫ్లోర్‌లీడర్ సత్తిబాబు విమర్శించారు. కూలిన రిటైనింగ్ వాల్స్‌ను వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ముందస్తుగానే తెలియపరిచినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. డివిజన్ కార్యదర్శి జి.బాలదుర్గారావు. ఎస్.గురప్ప, పి.శ్రీను, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు.. అదేతీరు!

(5వ పేజీ తరువాయి)

ప్రజలు మారడంలేదు. చిరు వ్యాపారులు, స్థానికులు ఇష్టానుసారం ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర పాలిథీన్ చెత్తను బుడమేరులో పడవేయటం వల్ల అవి కూడా ఇప్పుడు బుడమేరు ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. మానవ తప్పిదాలు, ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్న వర్షాలకే ఇబ్బంది పడాల్సి వస్తోంది.

క్షేత్రస్థాయి పర్యటించి సమస్య గుర్తించిన కలెక్టర్

బుడమేరు నిండుగా ప్రవహిస్తుండటం చూసి పైనుంచి వరద వస్తుందేమోనని సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రజలు భయపడిపోతున్నారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బుడమేరును ప్రతి రోజూ పరిశీలిస్తున్నారు. బుడమేరు ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని గుర్తించిన ఆయన ఈ బాధ్యతలను విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్రకు అప్పగించారు. మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంతో సమావేశమై యాక్షన్ ప్లాన్ రూపొందించారు. నగర పరిధిలో బుడమేరు కాలువను డ్రోన్ క్యాప్చరింగ్ చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం సత్ఫలితాలను ఇచ్చింది. బుడమేరు కాలువ ప్రవాహానికి నగర పరిధిలో ఎక్కడెక్కడ ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయో గుర్తించటం జరిగింది. డ్రోన్ క్యాప్చరింగ్ ద్వారా రామవరప్పాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్ఎల్‌వీ గ్రాండ్ దగ్గర గుర్రపుడెక్క, వ్యర్థాలు పేరుకుపోవటాన్ని గుర్తించారు. చాలా పెద్ద ఎత్తున వ్యర్థాలు ఇక్కడ పేరుకుపోయి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వీటిని తొలగించేందుకు మునిసిపల్ కమిషనర్ లాంగ్ ఆర్మ్ పొక్లెయినర్లు, జేసీబీలను తెప్పించారు. చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఈలు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ సింధూర నేతృత్వంలో బుడమురులో గుర్రపు డెక్క, పాలిథీన్ వ్యర్థాల తొలగింపు ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించటంపై ఇంజనీరింగ్ బృందాన్ని కమిషనర్ అభినందించారు. బుడమేరు కాలువతో పాటు నగరంలోని ఏలూరు, బందరు, రైవస్ కాల్వలను కూడా ప్రతి రోజూ డ్రోన్ క్యాప్చరింగ్ చేస్తూ ప్రవాహ నిరోధకాలను తొలగించేందుకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు ఇచ్చారు.

రేపూడి తండాలో వైద్య శిబిరాల ఏర్పాటు

(5వ పేజీ తరువాయి)

మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు ఆదివారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోతిబాబు మాట్లాడుతూ సీజనల్‌గా వైరల్ జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. గ్రామంలో 12 మంది జ్వరం, జలుబుతో బాధపడుతున్నారని తెలిపారు. వారికి వైద్య సేవలు అందించినట్టు చెప్పారు. మరికొందరు కంభంపాడులోని ఒక ప్రైవేట్ అస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారన్నారు. దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. జ్వర బాధితులు ఎ.కొండూరు పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.కొండూరు ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి బాబువలి పాల్గొన్నారు.

కొరత సృష్టిస్తే కఠిన చర్యలే

- ఆకస్మిక తనిఖీలను విస్తృతం చేయండి
- ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద కంట్రోల్‌రూం నెంబర్
- నానో ఎరువుల వినియోగంతో అదనపు ప్రయోజనాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో వున్నాయని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఒక్క కిలో కూడా ఎరువులు పక్కదారి పట్టకూడదని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం వ్యవసాయ, సహకార, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ, టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కొరతకు ఆస్కారం లేకుండా సమృద్ధిగా ఎరువులు వున్నాయని, పక్కదారి పట్టకుండా, ప్రతి రైతుకూ న్యాయబద్ధంగా ఎరువులు పొందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు తీసుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువుల సరఫరాకు సంబంధించి లెక్క పక్కాగా వుండాలని స్పష్టం చేశారు. ఫిజికల్, ఆన్‌లైన్ రికార్డులతో పాటు లావాదేవీలు పారదర్శకంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 6,388 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ కాంప్లెక్స్, మొత్తం 23,820 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో వున్నట్టు తెలిపారు. నానో ఎరువుల వినియోగంతో బహుళ ప్రయోజనాలున్నాయని, నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిని ఉపయోగించడం వల్ల పంట నాణ్యత, ఉత్పత్తి పెరగడంతో పాటు నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు వీలుంటుందన్నారు. సంప్రదాయ ఎరువుల కంటే తక్కువ ధరలోనే ఇవి లభ్యమవుతాయని, తేలిగ్గా స్ప్రే చేయొచ్చని వివరించారు. ఎరువుల సరఫరాపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 91549 70454 నెంబరుతో కంట్రోల్ రూం అందుబాటులో వుందని, ఈ నెంబరును ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించడం, ఇతర ప్రయోజనాలకు మళ్లించడం చేస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

వర్షాలు, వరదలపై అప్రమత్తం

వచ్చే మూడురోజుల పాటు భారీ వర్షాలు, వరదలపై అప్రమత్తంగా వుండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నదికి వెళ్లే మార్గాలు, వాగులు వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ప్రదర్శించాలని ఆదేశించారు. నిరంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్సులో జేసీ ఇలక్కియ, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వేదాద్రి వద్ద కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తీర గ్రామాలను అప్రమత్తం చేయండి

- అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

జగ్గయ్యపేట రూరల్ : కృష్ణానదికి ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం ఉందని, నదీపరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఘాట్ రోడ్డు వ్యూ పాయింట్ నుంచి కృష్ణానది ప్రవాహాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్పపీడన ద్రోణితో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు నిండుకున్నాయన్నారు. వరద వచ్చే అవకాశం ఉన్నందున నదీపరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కష్ణానదిపాటు పాలేరు, వాగులు, వంకల ద్వారా వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షితంగా తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర, తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు ప్రమాణపత్రాలు అందజేస్తున్న చలసాని ఆంజనేయులు, పాలకవర్గసభ్యులు

5,465 బంగారు కుటుంబాలకు

మార్గదర్శి కృష్ణామిల్క్ యూనియన్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పేదరికంలేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పీ-4లో కృష్ణామిల్క్ యూనియన్ 5,465 గ్రామీణ బంగారు కుటుంబాలకు మార్గదర్శనం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చింది. ఈమేరకు యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు నందిగామ మండలం మునగచర్లలో జరిగిన సామూహిక గోకులం కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశకు ప్రమాణ పత్రాలు అందజేశారు. వత్సవాయి నుంచి 1524, పెనుగంచిప్రోలు నుంచి 1192, విస్సన్నపేట నుంచి 1255, విజయవాడ రూరల్ నుంచి 747, చందర్లపాడు నుంచి 747 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ఆంజనేయులు ప్రకటించారు. ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసి అవసరమైన చేయూత అందించనున్నట్టు పేర్కొన్నారు. పాడి పశువుల కొనుగోలుకు కేడీసీసీ బ్యాంకు ఇచ్చే రూ.లక్ష రుణాలకు సంబంధించి వడ్డీని యూనియన్ భరిస్తుందన్నారు. పశుగ్రాసంతో పాటు వైద్య సేవలపై యూనియన్ ప్రత్యేక దృష్టిసారిస్తుందని, అవసరం మేరకు సామూహిక గోకులాలు ఏర్పాటుచేసి వాటిని సద్వినియోగం చేసుకొనేలా మహిళా పాడి రైతులను ప్రోత్సహిస్తామన్నారు. బంగారుకుటుంబాల సభ్యులకు అవసరం మేరకు ఆరోగ్య సేవలు అందిస్తామన్నారు. వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేందుకు ముందుకొచ్చిన కృష్ణామిల్క్ యూనియన్‌కు కలెక్టర్ లక్ష్మీశ ధన్యవాదాలు తెలిపారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషిచేయండి

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- అట్టహాసంగా గన్నవరం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ప్రస్తుతమున్న రూ.6.50 కోట్ల ఆదాయాన్ని వచ్చే ఏడాదికి రూ.8.30 కోట్లకు పెంచేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి పదవులు వస్తాయన్నారు. గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా ఆదివారం జరిగింది. ఏఎంసీ ఛైర్మన్‌గా గూడవల్లి నరసింహారావు(నర్సయ్య), వైస్ ఛైర్మన్‌గా కొండేటి వెంకటేశ్వరరావు, పాలకవర్గసభ్యులతో ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రమాణాస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్ అధ్యక్షత వహించారు. ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు(నర్సయ్య) ప్రమాణాస్వీకారానికి భారీ ర్యాలీతో వచ్చారు. నర్సయ్యను ఎమ్మెల్సీ ఆలపాటి రాజా శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ.. నెంబర్ వన్ మార్కెట్ యార్డుగా తీర్చిదిద్దాలని చెప్పారు. నర్సయ్యకు పదవి రావడానికి సహకరించిన కూటమి నేతలు సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మాధవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కూటమి పార్టీలు ఒక్కటిగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. పంట నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాములను నిర్మించుకోవాలన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి మాట్లాడుతూ, రైతు కంట నీరు రాకుండా చూడాలన్నారు. డొంక రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గానికి రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చేలా పనిచేయాలన్నారు. కష్టపడిన వారికే పదవులు లభిస్తాయని నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు అన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రెండ్రోజులుగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతూనే ప్రమాణాస్వీకారానికి హాజరయ్యారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, బచ్చుల బోస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోటగిరి వరప్రసాద్, బొప్పన హరికృష్ణ, కోనేరు నాని, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, చిమట రవివర్మ, కురుమద్దాలి ఫణికుమార్, దయాల రాజేశ్వరరావు, మూల్పూరు సాయికళ్యాణి, బోడపాటి రవి, గొడ్డళ్ల చినరామారావు, కోనేరు సందీప్, సర్నాల బాలాజీ, కలపాల కిరణ్, ఏడీఏ సునీల్, మార్కెట్ యార్డు ఏడీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పరుగులు

(5వ పేజీ తరువాయి)

ఆదాయం ఉంది. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రూ.48 కోట్లు, రూ.2,817 కోట్లు, రూ.11,623 కోట్ల జీవీఏ సాధించగా.. రూ.4,73,803 తలసరి ఆదాయం ఉంది. మైలవరం నియోజకవర్గం పరిధిలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వరుసగా రూ.3,199 కోట్లు, రూ.4,135 కోట్లు, రూ.8211 కోట్లు జీవీఏ సాధించగా.. రూ.4,12,803 తలసరి ఆదాయం లభించింది. నందిగామ నియోజకవర్గంలో పై రంగాల్లో వరుసగా రూ. 2,106 కోట్లు, రూ. 2,119 కోట్లు, రూ.4,720 కోట్లు జీవీఏ సాధించగా రూ.3,43,328 తలసరి ఆదాయం సాధించింది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో పై మూడు రంగాలలో వరుసగా రూ. 2604 కోట్లు, రూ. 3324 కోట్లు, రూ.5545 కోట్లు జీవీఏ సాధించగా.. రూ. 3,75,099 ల తలసరి ఆదాయాన్ని సాధించటం జరిగింది.

హెచ్చుతగ్గుల వరద

(5వ పేజీ తరువాయి)

ఉంది. మధ్యాహ్నం మూడు గంటలకు ఇన్‌ఫ్లో 2,75,215 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 2,78,249 క్యూసెక్కులుగా రికార్డయింది. రాత్రి ఇన్‌ఫ్లో కాస్త తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి బ్యారేజీకి 2,42,614 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజ్ 70 గేట్లను 6 అడుగుల మేరకు ఎత్తి 2,82,358 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పాలేరు నుంచి 9,535, కీసర నుంచి 56,504, పులిచింతల నుంచి 1,76,575 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీని నుంచి కాల్వలకు 3,034 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మున్నేరు నుంచి 28,341 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రాత్రి ఏడు గంటలకు 6,966 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 6,654 క్యూసెక్కులుగా ఉంది. పులిచింతల ప్రాజెక్టుకు ఉదయం తొమ్మిది గంటలకు నాగార్జునసాగర్ నుంచి 2,15,650 క్యూసెక్కుల నీరు రాగా, దిగువకు 1,97,033 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ ఇన్‌ఫ్లో కాస్త పెరిగింది. 2,02,570 క్యూసెక్కుల వరద రాగా, దిగువకు 2,43,887 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తర్వాత గంట నుంచి ఇన్‌ఫ్లో కొంచెం తగ్గుముఖం పట్టింది. సాయంత్రం ఐదు గంటలకు 1,67,020 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 2,90,526 క్యూసెక్కులుగా రికార్డయింది. రాత్రి ఏడుగంటలకు మళ్లీ ఇన్‌ఫ్లో పెరిగింది.





బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ..

ఉచితం, సెలవుల ఎఫెక్ట్

పీఎన్‌బీఎస్ కిటకిట

- బస్సు ఎక్కేందుకు తీవ్ర తోపులాట

విజయవాడ సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత ప్రయాణం, మూడు రోజుల సెలవుల అనంతరం తిరుగు ప్రయాణం కోసం వచ్చిన ప్రయాణికులతో పండిట్ నెహ్రూ బస్టాండ్ (పీఎన్‌బీఎస్) కిటకిటలాడింది. వేలాదిగా ప్రయాణికులతో బస్టాండ్, సిటీ బస్ పోర్టు కిక్కిరిసిపోయింది. ప్లాట్‌ఫాంపై బస్సు ఎక్కేందుకు తోపులాటలు జరిగాయి. ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆటో ప్రయాణాలకు మొగ్గుచూపిన మహిళా లోకం, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కదం తొక్కినట్టు ఉంది. వివిధ పనులపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సుల కోసం వేచిచూస్తున్న ఘటనలు నగరంలో చోటుచేసుకుంటున్నాయి. బస్ స్టేషన్ వద్ద తప్ప ఇతర స్టాపుల వద్ద సీటు దొరకటం కష్టమే. బస్సు వచ్చీ రావడంతోనే చుట్టుముట్టేస్తున్నారు. బస్సు ప్లాట్‌ఫాంపై పెట్టనివ్వాలని.. డ్రైవర్, కండెక్టర్‌లు వేడుకుంటున్నా.. ససేమిరా అంటూ సీటు దక్కించుకోవాలనే ఆతృతతో ఎక్కేస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు మహిళల మధ్య వాగ్వాదాలు తలెత్తుతున్నాయి.

తిరుగు ప్రయాణం ఎఫెక్ట్..



పంద్రాగస్టు, కృష్ణాష్టమి, ఆదివారం.. ఇలా వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి జిల్లాలోని సొంత ఊళ్లకు ఎన్నో కుటుంబాలు వచ్చాయి. ఇదే క్రమంలో విజయవాడ నగరంలో ఉద్యోగాలు చేస్తున్న ఎంతోమంది వారివారి సొంత ఊళ్లకు వెళ్లారు. ఆదివారంతో సెలవు ముగిస్తున్న తరుణంలో విజయవాడ నుంచి సొంత ఊళ్లకు వెళ్లిన వారు తిరిగి విజయవాడకు రావడం, వేరే ప్రాంతాల నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సొంత ఊళ్లకు వచ్చిన వారు తిరుగు ప్రయాణం ప్రారంభించడంతో ఆదివారం సాయంత్రం బస్టాండ్ కిక్కిరిసింది. సాధారణ రోజుల్లో మాదిరిగానే సమయానుకూలంగా ఉన్న బస్సులు చాలకపోవడంతో చిన్నారులు, వృద్ధులతో సహా ప్రయాణికులు ప్లాట్ ఫాం పైనే పడిగాపులు పడిన దృశ్యాలు కనిపించాయి.

జాతీయ రహదారులపై ట్రాఫిక్ కష్టాలు

మూడు రోజుల అనంతరం సొంత కారులో హైదరాబాద్ వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో విజయవాడ-హైదరాబాద్, మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసింది. రాత్రి 7.30 నుంచి జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. రోడ్డుపై కారుల సంఖ్య విపరీతంగా పెరగడంతో విజయవాడ నగరంలోని బెంజిసర్కిల్, స్క్యూబ్రిడ్జి కృష్ణలంక ప్రాంతాలతో పాటు, గొల్లపూడి వద్ద ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు ముందుకు సాగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహానికి గురయ్యారు.

బార్‌లు @183

(5వ పేజీ తరువాయి)

ఇవ్వబోతున్నారు. ఓపెన్ కేటగిరి, గీత కార్మికులకు కేటాయించిన బార్‌లు మొత్తం 183 ఏర్పాటు కాబోతున్నాయి. ఇందులో ఎన్టీఆర్ జిల్లాలో 140, కృష్ణాజిల్లాలో 43 బార్‌లు రాబోతున్నాయి. వాటిలో గీత కార్మికులకు 14 బార్‌లను కేటాయించారు. ఎన్టీఆర్ జిల్లా పది, కృష్ణా జిల్లాలో నాలుగు బార్‌లను గీత కార్మికులకు రిజర్వ్ చేశారు. ఈ బార్‌లను గౌడ, గౌడ్ ఉప కులాలకు కేటాయిస్తారు. ఏ బార్ ఏ ఉపకులానికి కేటాయిస్తారన్న విషయం సోమవారం తేలుతుంది. జిల్లా కలెక్టర్ లాటరీ ద్వారా గౌడ, గౌడ్ ఉప కులాలకు ఏయే నంబర్ల బార్‌లు కేటాయించాలన్నది నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 162 బార్‌లు ఉన్నాయి. ఇందులో ఎన్టీఆర్ జిల్లాలో 120, కృష్ణాజిల్లాలో 32 బార్‌లు ఉన్నాయి. ఇవి కాకుండా మరో పది స్టార్ హోటళ్లలో ఉన్నాయి. వాటి లైసెన్స్ గడువు ఈనెలాఖరుతో పూర్తవుతుంది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం రూపొందించిన కొత్త బార్ విధానం ప్రకారం లైసెన్స్‌లను జారీ చేస్తారు.

ఎక్కడెక్కడంటే...

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 130 బార్లను ఓపెన్ కేటగిరికి, పది బార్లను గీత కార్మికులకు కేటాయించారు. విజయవాడలో 117 బార్‌లు ఓపెన్ కేటగిరికి, తొమ్మిది బార్‌లు గీత కార్మికులకు రిజర్వ్ చేశారు. జగ్గయ్యపేటలో రెండు, నందిగామలో రెండు, తిరువూరులో ఒక బార్‌ను ఓపెన్ కేటగిరికి కేటాయించారు. కొండపల్లిలో ఎనిమిది బార్‌లను ఓపెన్ కేటగిరికి, ఒక బార్‌ను గీత కార్మికులకు రిజర్వ్ చేశారు. కృష్ణాజిల్లాలో 39 బార్లను ఓపెన్ కేటగిరికి, నాలుగు బార్‌లను రిజర్వేషన్ కేటగిరికి ఇచ్చారు. మచిలీపట్నంలో పది బార్‌లను ఓపెన్ కేటగిరికి, ఒక బార్‌ను రిజర్వేషన్‌లో ఉంచారు. పెడనలో ఒకటి, ఉయ్యూరులో ఒక బార్ ఏర్పాటు కాబోతున్నాయి. ఈ రెండింటిని ఓపెన్ కేటగిరికి కేటాయించారు. గుడివాడలో పది బార్‌లను ఓపెన్ కేటగిరికి, ఒక బార్‌ను గీత కార్మికులకు, తాడిగడపలో 14 బార్‌లను ఓపెన్ కేటగిరికి, రెండు బార్‌లను గీత కార్మికులకు కేటాయించారు. ఇవి కాకుండా పర్యాటక కేటగిరిలో మంగినపూడలో ఒకటి, అవనిగడ్డలో రెండు బార్‌లను ఏర్పాటు చేయబోతున్నారు. లాటరీ ద్వారా ఎంపికైన బార్‌లకు 2028 ఆగస్టు 31 వరకు లైసెన్స్‌ను ఇస్తారు.

డీఏ బకాయిలపై హైకోర్టుకు

- బకాయిలు చెల్లించకపోతే పెన్షన్ మార్చ్
- ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) హైకోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు బాజీ పఠాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏబకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పటికీ ఐదేళ్లుగా ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ కాలేదని, ప్రభుత్వానికి, అధికారులకు వందలసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. హైకోర్టు, అసెంబ్లీలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులకే బకాయిలు చెల్లించి, మిగిలినవారికి ఇంత వరకు చెల్లించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘనే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేసి మరణించిన వారి కుటుంబాలకు డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించడానికి సెప్టెంబరు 1న 'పెన్షన్ మార్చ్' చేస్తామని తెలిపారు. నాగార్జున వర్సిటీ నుంచి విజయవాడ అంబేడ్కర్ విగ్రహం వరకు నల్లదుస్తులు ధరించి పాదయాత్రగావెళ్లి నిరసన తెలుపుతామని, మార్చ్‌ను ఉద్యోగులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

డెంటల్ ఆసుపత్రికి టెండర్ల ఆహ్వానం

● ఆసుపత్రి కార్యాలయంలో రూ.2వేలతో టెండర్ ఫారం

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ దంత వైద్యశాలకు మందులు, వైద్య పరికరాల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెండర్లు వేయడానికి ఆసక్తిగల అభ్యర్థులు రూ.2వేలు చెల్లించి టెండర్ ఫారంను సోమవారం నుంచి ప్రభుత్వ దంత వైద్యశాల, ఆసుపత్రి కార్యాలయంలో తీసుకోవచ్చన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం) ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకొనేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

నేటి నుంచి పీబీ సిద్ధార్థలో తెలుగు కార్యశాల

విజయవాడ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మైసూరుకు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (భారతీయ భాషల సంస్థ), నేషనల్ టెస్టింగ్ సర్వీస్ - ఇండియా (జాతీయ పరీక్ష సేవాకేంద్రం), విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో తెలుగులో పరీక్ష మూల్యాంకనం, ప్రశ్నాంశ రచనపై ఆరు రోజుల శిక్షణ శిబిరం సోమవారం ఉదయం 10 గంటలకు పీబీ సిద్ధార్థ కాలేజీ సెమినార్ హాలులో ప్రారంభమవుతుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షతన జరిగే ఈ సభలో కార్యక్రమ ఉద్దేశ్యాన్ని సీఐఐఎల్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎం నారాయణరెడ్డి వివరిస్తారు. కళాశాల కన్వీనర్, సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలితప్రసాద్ ప్రారంభోన్యాసం చేస్తారు. సహాయాచార్యులు డాక్టర్ ఎన్ శివకుమార్ కీలక ఉపన్యాసం చేస్తారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సీనియర్ ఫెలో డాక్టర్ కే రవిబాబు పాల్గొంటారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కే బాలకృష్ణ, డాక్టర్ కే బాలకృష్ణ తెలుగు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు పాఠాలు బోధిస్తారు. ఈనెల 20 వరకు ముఖాముఖి విధానంలో ప్రత్యక్షంగా జరిగే ఈ కార్యక్రమం ఈనెల 21 నుంచి 23 వరకు ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతుంది.

పండుగలు మన సంస్కృతికి ప్రతిబింబాలు

పటమట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ పేర్కొన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా 11వ డివిజన్ యాదవుల బజారులో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు.

ఫ్యూజులెగురుతున్నాయ్..!

ప్రమాదకరస్థితిలో ఫ్యూజు బాక్స్, ట్రాన్స్‌ఫార్మర్

పటమట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏమాత్రం చిన్న పొరపాటు జరిగిన ఫ్యూజుబాక్సుతో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు. పటమట దర్శిపేట మాబుసుభానీ జెండా చెట్టు పక్కన విద్యుత్ ఫ్యూజు బాక్సు కింద రెండు రాళ్ల ముక్కలను పెట్టి నిలబెట్టారు. పక్కనే లోతైన డ్రెయినేజీ ఉంది. ఫ్యూజు బాక్సు కింద రాళ్లు ఏమాత్రం కదిలిన అమాంతం డ్రెయినేజీలో పడిపోతుంది. దీనికితోడు దర్శిపేట అంబేడ్కర్ నగర్‌కు విద్యుత్ సప్లై చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను జెండా చెట్టు గోడను పగులగొట్టి గోడ మధ్యలో అమర్చారు. ట్రాన్స్‌ఫార్మర్ కింద మట్టి చదునుగా లేక అది ముందుకు ఒరిగి ఉంది. భారీ వర్షాలకు ఆ మట్టి కరిగిపోతే ట్రాన్స్‌ఫార్మర్ అమాంతం డ్రెయినేజీలో పడిపోతుంది. ఆ పక్కన ఎన్ఎస్ఎం స్కూలు ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కిరాణా షాపులు, అపార్ట్‌మెంట్లు, భవనాలలో ప్రజలు నివసిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ సిబ్బంది ఫ్యూజు బాక్సుకు కాంక్రీట్‌తో పటిష్ఠపరచాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకర పరిస్థితిలో డ్రెయినేజీ పక్కనే ఫ్యూజు బాక్సు, ముందుకు ఒరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



పీఅండ్‌టీ న్యూ కాలనీ రెండో రోడ్లో ప్రమాదకరంగా మారిన డ్రెనేజీ

ఆదమరిస్తే అంతే..!

భారతీనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చూడడానికి చిన్న సమస్యగానే ఉన్న ఆదమరిస్తే ప్రాణాలకే ప్రమాదకరంగా మారుతుంది. గురునానక్ రోడ్డు నుంచి పీఅండ్‌టీ న్యూ కాలనీ వెళ్లే 2వ రోడ్లో డ్రెయిన్‌పైన సిమెంట్ దిమ్మలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం ఈ సిమెంట్ దిమ్మలు డ్రెయినేజీపై సరిగా లేకుండా ఉన్నాయి. దీంతో డ్రెయినేజీపై తెరిచి ఉండి ప్రమాదకరంగా మారింది. కాలనీ ప్రధాన రోడ్డులో ఒకటి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అసలే వర్షాకాలం భారీ వర్షం కురిస్తే కాలనీలోని అంతర్గత రోడ్లు జలమయమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో డ్రెయినేజీలపై సిమెంట్ దిమ్మలను సరిగా ఏర్పాటు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తే ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని వారు భయపడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేదల కోసమే ఉచిత వైద్యశిబిరాలు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ పేదలకు సహాయం చేసేందుకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ గుణదల సెంటర్‌లోని విజయవాడ ఈస్ట్ జెమ్స్ లయన్స్ క్లబ్ చారిటబుల్ ఫౌండేషన్, జాస్తి ప్రసాద్ ఆధ్వర్యంలో మధుమేహం ఉచిత వైద్యశిబిరం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌తో ఎప్పటి నుంచో అనుబంధం ఉందన్నారు. లయన్స్ క్లబ్ అంటే అంతర్జాతీయ సంస్థ అని దేశ, విదేశాల్లో వేలాది కోట్లరూపాయలతో సేవా, సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. 1985 నుంచి లయన్స్ క్లబ్‌లో తాను సభ్యుడిగా ఉన్నానన్నారు. డాక్టర్లు సుధాకర్ బాబు, తమ్మినేని రామకృష్ణ, పద్మ, అబ్దుల్‌కలాం, అనిల్ కుమార్, జనసేన నేతలు గుత్తికొండ కృష్ణమోహన్, బండి కోమలి, లయన్స్ క్లబ్ సభ్యులు స్థానిక నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

తెలుగు భాష ప్రాచీనతకు శాసనాలే ఆధారాలు

● 14వ అమెరికా తెలుగు సాహితీ సదస్సులో ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ భాషల్లో తెలుగు ప్రాచీనమని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి హ్యూస్టన్‌లో నిర్వహించిన 14వ తెలుగు సాహితీ సదస్సులో ఆదివారం తెలుగు భాష ప్రాచీనతకు శాసనాలే ఆధారాలన్న అంశంపై ఆయన ప్రసంగించారు.

సా.శ.పూ.3వ శతాబ్దికి చెందిన భట్టిప్రోలు రాతి బుద్ధదాతుపేటిక ప్రాకృత శాసనంలో ఉన్న అనేక వ్యక్తుల పేర్లు తెలుగులో ఉన్నాయని అవి శాసనాల్లోకి ఎక్కాయంటే అంతకు మునుపే ఆ భాష వాడుక భాషగా ఉండేదని, తద్వారా తెలుగు ప్రాచీనత ఇప్పటికీ 2500 ఏళ్ల పూర్వానికి వెళుతుందన్నారు.



ఈమని శివనాగిరెడ్డిని సత్కరిస్తున్న వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిట్టెం రాజు, కాత్యాయని విద్మహే తదితరులు

ఆ తర్వాత వెలువడిన సా.శ.పూ. రెండో శతాబ్ది కొత్తూరు, కోటిలింగాల నాణేలు, సా.శ. 1వ శతాబ్ది అమరావతి, ధూళికట్ట, నాగార్జునకొండ విజయ శాతకర్ణి శాసనాలు, సా.శ. 3వ శతాబ్ది నాగార్జునకొండ అడివి శాంతసిరి శాసనం, సా.శ. 4వ శతాబ్ది కొండముది, సా.శ. 5వ శతాబ్ది విష్ణుకుండినుల కీసరగుట్ట, తుమ్మలగూడెం శాసనాలు, సా.శ. 6వ శతాబ్ది తొట్ట తొలి పూర్తి నిడివి గల రేనాటి చోళ ఎరికల్ ముత్తురాజు ధనుంజయని కలమల్ల శాసనంలో తెలుగు పదాల, క్రమవికాసాన్ని శివనాగిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ప్రముఖ సినీ మాటల రచయిత బుర్ర సాయి మాధవ్, తానా పూర్వ అధ్యక్షుడు డాక్టర్ తోటకూరి ప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త కాత్యాయనీ విద్మహే శివనాగిరెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వంగూరి ఫౌండేషన్ ఛైర్మన్ వంగూరి చిట్టెంరాజు, హోస్టన్ తెలుగు సాహితీ సమితి అధ్యక్షుడు తిప్పిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి శివనాగిరెడ్డిని సత్కరించారన్నారు.

108లో మహిళ ప్రసవం

● ఆగిరిపల్లి నుంచి విజయవాడ వస్తుండగా ఘటన

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరశివారు నున్నకు చెందిన 108లో శనివారం ఓ మహిళ ప్రసవించింది. ఆగిరిపల్లి ప్రాంతానికి చెందిన షేక్ మీరాబీ అనే మహిళకు ప్రసవ నొప్పులు రావడంతో నున్న 108కు సమాచారం అందించారు. ఈలోగా మహిళను 108కు ఎదురుగా తీసుకెళ్తే సమయం కలిసి వస్తుందనే ఆలోచనతో అగిరిపల్లి నుంచి ఆటోలో తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న 108 వాహనం ఆగిరిపల్లి వైపు వెళ్లగా సూరంపల్లి అడ్డరోడ్డులో ఆటో ఎదురు కావడంతో సిబ్బంది అక్కడే మహిళను ఎక్కించుకున్నారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రికి తీసుకువస్తుండగా అజిత్ సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ సమీపంలో ఆమెకు ప్రసవం జరిగింది. పండంటి మగబిడ్డకు జన్మకు జన్మనివ్వగా ఆమెను పాత ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది ఈఎం టీ వెంకయ్య, వాహన పైలెట్ బుచ్చిబాబు, కుటుంబ సభ్యులు మహిళకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రసవం చేశారు.





కరెన్సీనగర్ కాలనీలోని ఖాళీస్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు, కనకదుర్గ నగర్ కాలనీలో ఖాళీస్థలంలో నిలిచిన నీరు

ఖాళీస్థలాలతో ప్రజల ఆరోగ్యం ఖాళీ

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: నివాసాల మధ్యనున్న ఖాళీ స్థలాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 3వ డివిజన్‌లోని కరెన్సీనగర్ కాలనీ, శ్రీ రామచంద్రనగర్ కాలనీ, విజయలక్ష్మీ కాలనీ, గణేష్ నగర్, కనకదుర్గనగర్, తదితర కాలనీల్లోని అంతర్గత రోడ్లలో నివాసాల మధ్య అక్కడక్కడ ఖాళీ స్థలాలున్నాయి. వీటి గురించి స్థల యజమానులు, అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డుకు తక్కువ ఎత్తులో ఉండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపునీరు, మురుగు నీరు చేరడంతో చెరువులా మారాయి. ఈ ఖాళీ స్థలంలో ప్రస్తుతం పచ్చగడ్డి, పిచ్చి మొక్కలతోపాటు చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. దోమలు వృద్ధి పెరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ దోమల వల్ల చిన్నారులు, వృద్ధులు ఎక్కడ అనారోగ్యానికి గురవుతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఆ ఖాళీ స్థలాల్లో వర్షం నీరు చేరి చెరువులా మారి ప్రమాదకరంగా ఉంటుందని భయపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్ ఆటో

● పాడైన చెత్త తరలించే బళ్లు, పట్టించుకోని అధికారులు

ఆటోనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దోమల నుంచి జవహర్ ఆటోనగర్‌లోని కార్మికులను కాపాడేందుకు కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్ ఆటో దశాబ్దకాలంగా నిరుపయోగంగా ఉంటోంది. ఈ ఆటోలో ఫాగింగ్ మిషన్ అమర్చి ఆటోనగర్ మొత్తం తిరిగి దోమల బెడద నుంచి స్థానికులను, వివిధ గ్యారేజీల్లో పనిచేసే కార్మికులను కాపాడేందుకు కొనుగోలు చేశారు. ఇది మూణ్నాళ్ల ముచ్చటిగానే నడిసింది. ఏపీఐఐసీ అధికారులు, ఐలా పాలకవర్గం, అధికారుల అశ్రద్ధ వల్ల ఆటోనగర్‌లోని ఐలా కార్యాలయం వద్ద తుప్పపట్టి పనికిరాని విధంగా తయారైంది.

పాడై మూలనపడిన చెత్త తరలించే బళ్లు

ఆటోనగర్‌లో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు కొనుగోలు చేసిన చెత్త తరలించే రెండు బళ్లు పాడైపోయాయి. చిన్నపాటి మరమ్మతులకు గురైన ఈ చెత్త సేకరణ బళ్లను పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా మూలనపడ్డాయి. తుప్పపట్టి పనికిరాని విధంగా తయారయ్యాయి. ఏపీఐఐసీ, ఐలా అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం వలనే ఈ వాహనాలు మూలన పడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి మూలన పడిన బళ్లకు మరమ్మతులు చేయించి సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అవి పనికిరాకపోతే కొత్త బళ్లు కొనాలని కోరుతున్నారు.




ఆటోనగర్ ఐలా కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ మెషన్ ఆటో

అక్రమ పార్కింగ్‌తో ఇబ్బందులు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఇరువైపులా వాహనాలు

పటమట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరనగర్, దర్శిపేట జంక్షన్ నుంచి పటమట సెంటర్‌కు, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కృష్ణవేణి స్కూల్ మీదుగా ఎన్ఎస్ఎం స్కూల్ వరకు, యనమదలకుదురుకు వెళ్లాలంటే దర్శిపేట జంక్షన్ నుంచి ఎన్ఎస్ఎం స్కూల్ వరకు చాలా కీలకం. అటువంటి ప్రాధాన్యత సంతరించుకున్న రోడ్డులో దర్శిపేట పార్కు పక్కన, విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఆటోలు, కార్లను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడే రాజరాజేశ్వరీ కల్యాణ మండపంలో శుభకార్యాలకు హాజరైన వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్ఎస్ఎం స్కూల్లో దింపి మళ్లీ తీసుకువెళుతూ ఉంటారు. అటువంటి రద్దీ సమయాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతూ ఉంటాయి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుకిరువైపులా అక్రమ పార్కింగ్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.




శ్రీకాళహస్తీశ్వర శతక పుస్తకావిష్కరణ చేస్తున్న చీఫ్ సెక్రటరీ కే విజయానంద్

శ్రీకాళహస్తీశ్వర శతకము పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రముఖ గ్రంథకర్త కర్రి రాజ భౌమ హరి నారాయణ చక్రవర్తి రచించిన శ్రీ కాళహస్తీశ్వర శతకము పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశాలాంధ్ర పబ్లిషర్స్ జనరల్ మేనేజర్ మనోహరనాయుడు, రచయిత కర్రి రాజ భౌమ హరి నారాయణ చక్రవర్తి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు రేగుళ్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ శతక కవితా సంపుటి శ్రీకాళహస్తీశ్వరునిపై చేసినట్టు రచయిత తెలిపారు. తెలుగు సాహిత్యంలో ఆధ్యాత్మిక రచనలకు విశేష స్థానం కలిగిన సమయంలో, ఇలాంటి కృషి అభినందయనీయమని పలువురు వ్యాఖ్యానించారు. రచయిత హరి నారాయణ చక్రవర్తి మాట్లాడుతూ, శ్రీకాళహస్తి మహత్యాన్ని శతక రూపంలో అందించడం ఆధ్యాత్మిక ప్రేరణ ఫలమన్నారు.







GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-209467

FLAT FOR SALE

» 14 లక్షలకే మురళీనగర్‌లో 3వ ఫ్లోర్‌లో సింగిల్ బెడ్‌రూమ్ పెంట్‌హౌస్ బ్యాంక్ లోన్ సౌకర్యంతో అమ్మకం. సంప్ర: ✆ 93810 60509
AJB-209469

» 21 లక్షలకే గొల్లపూడిలో 600 Sft. 1st ఫ్లోర్ 2B/R తూర్పు ఫేస్ గ్రూప్ హౌస్, 24 లక్షలకే కేదారేశ్వరపేట 2 B/R గ్రూప్ హౌస్ అమ్మకం. సంప్ర. 93810 60509
AJB - 209475

స్థలం అమ్మకము

» నేషనల్ హైవే ప్రక్కన కాజ నందు CRDA అప్రూవల్‌తో 200 గజాలు స్థలం ప్లాట్ నెంబర్ 81 అమ్మకానికి కలదు. ఫోన్ : 9491507198
AJG-248604

WANTED

» ప్యాకింగ్ బాయ్స్ & ఆఫీసు బాయ్స్ 30 సం.ల లోపు, మగవారు మాత్రమే. విజయవాడలో పనిచేయవలెను. సంప్రదించండి : సెల్: 93900 83900
AJB-6

» మురళీ రిసార్ట్స్ విజయవాడ నందు పనిచేయుటకు స్టాఫ్ కావలెను. హౌస్ కీపింగ్ ఎగ్జిక్యూటివ్స్ / సూపర్‌వైజర్, హౌస్ కీపింగ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్, ఎలక్ట్రీషియన్. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి : 7288885598
AJB-615

EDUCATION

» PRABHAS COLLEGES, VJA: REGULAR/DIST/ONLINE: MBA, MCA, MA, M.Com, M.Sc., BCA, BBA, B.Sc., BA, ADMS. L.Dt.:10-8-2025. Ph: 99634 72800, 99634 72819, 94935 32525.
AJB-81

TO-LET

» విజయవాడ, గాయత్రి నగర్, ఆచార్య రంగా వీధిలో 2 BHK ఫస్ట్ ఫ్లోర్, ఇండిపెండెంట్ హౌస్ అద్దెకు. సెల్ : 9246471857, 9848926691
AJB-235748

EDUCATION

» Admissions from 18th Aug into ANU Regular BA, BCom and BSc AI & CSc, Scholarships available for qualified. PLNM Degree College, Opp ANU, Cont: 9177408565, 9642656449
AJG-248618

» Distance Admissions: BA, BCom, BSc:CBZ, MPC, MStC, MPCs, PG Arts & Commerce Contact : 7997570408
AJG-248619

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి





బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.505

సంక్షేమం, అభివృద్ధి, సమానత్వం కూటమి అజెండా

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్

వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి, సమానత్వం కూటమి ప్రభుత్వ ఏకైక అజెండా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే వెంకట నారాయణ ప్రసాద్ (అన్న) అన్నారు. ఆదివారం హనుమాన్‌పేటలోని ఆయన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏడాదిలోనే సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ విధ్వంసకర పాలన నుంచి వికాసం దిశగా రాష్ట్రాన్ని నిలిపారన్నారు. ఇటీవల జరిగిన జగన్ సొంత నియోజకవర్గంలోని పులివెందులలో ప్రజలు కూటమి ప్రభుత్వానికి నీరాజనం పట్టారన్నారు.



ప్రకాశం బ్యారేజీవద్ద కిక్కిరిసిన సందర్శకులు

ప్రకాశం బ్యారేజీకి సందర్శకుల తాకిడి

వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది వద్ద ప్రకాశం బ్యారేజీకి ఆదివారం సందర్శకుల తాకిడి నెలకొంది. గత వారం నుంచి కృష్ణా నదికి భారీగా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరుకుంది. ఆదివారం సెలవు రోజు కావటంతో కృష్ణానదిలో నీటిని చూడటానికి నగర, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం తరలి వచ్చారు. దీంతో ప్రకాశం బ్యారేజీ, శనైశ్చరస్వామి ఆలయం, పద్మావతి ఘాట్ వద్ద జనం కిటకిటలాడారు. వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్ర మోహన్ పర్యవేక్షణలో సీఐ, ఎస్‌ఐలు తగిన భద్రతా చర్యలు చేపట్టారు. వర్షం వస్తున్నప్పటికీ సందర్శకులు కృష్ణానది వరదను తిలకిస్తూ తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. మరికొందరు సెల్ఫీలు దిగారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం

● ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

సత్యనారాయణపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణం మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచిందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 30వ డివిజన్ దావు బుచ్చయ్య కాలనీలో స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణసౌకర్యం కల్పించిన సందర్భంగా ఆదివారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ డివిజన్ నేతల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 8,500 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందిస్తున్నామన్నారు. దీని ద్వారా సుమారు 2 కోట్ల మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కష్టమైనా ఇచ్చిన ప్రతి హామీని నిజం చేస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. అనంతరం మిఠాయిలు పంచారు. డివిజన్ అధ్యక్షుడు లక్కంరాజు శ్రీనివాస్ రాజు, వెంకట రమణ, వీరభద్రం, బేబీ సరోజని, చౌదరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: అమ్మవారికి బోనాలు సమర్పించడం తెలుగు సంస్కృతిలో ఆచారమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా 58వ డివిజన్‌లో గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సారె సమర్పించి, భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. బొండా ఉమా మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సకల సౌభాగ్యాలు, సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. నేతలు ఘంటా కృష్ణమోహన్, వేముల దుర్గారావు, గుంజా లక్ష్మణరావు, రామారావు, కొండా, రామకృష్ణ, పాల్గొన్నారు.

మధురానగర్ : సేవకు అవధులుండవని తోటి వాళ్లకు సాయం చేయడంలో ఉన్న సంతృప్తి దేనిలో లభించదని, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్ అందుకు నిదర్శనమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో మధురానగర్ మెయిన్ రోడ్డులో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ముగ్గురు పేద విద్యార్థులకు సైకిళ్లు, ముగ్గురు నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు, ఒక అంగవైకల్యం ఉన్నవారికి ట్రైసైకిల్ పంపిణీ చేశారు. లయన్స్ జోన్ ఛైర్‌పర్సన్ హనుమంతురావు, క్లబ్ అధ్యక్షుడు లయన్ జనార్ధన్‌రావు, వైస్ గవర్నర్ లయన్ ఎన్‌వీవీఎస్‌వీ ప్రసాద్, లయన్ గార్లపాటి విజయకుమార్, క్యాబినెట్ సెక్రటరీ శ్యాం ప్రసాద్, కోశాధికారి లయన్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరావు, లయన్ సింగం వెంకన్న, లయన్ అంగిరేకుల రాంబాబు, ఆత్కూరి గోపి, కోడే అనంద్, లాలాజీ, సత్యన్నారాయణ పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు, సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మందుల సరఫరాకుటెండర్ల ఆహ్వానం

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ దంత వైద్యశాలకు మందులు, వైద్య పరికరాల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెండర్లు వేయడానికి ఆసక్తిగల అభ్యర్థులు రూ.2వేలు చెల్లించి టెండర్ ఫారంను సోమవారంనుంచి ప్రభుత్వ దంత వైద్యశాల కార్యాలయంలో తీసుకోవచ్చన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం : ఏపీయూడబ్ల్యూజే

గాంధీనగర్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీయూడబ్ల్యూజే రాజీలేని పోరాటం చేస్తోందని యూనియన్ నేతలు ఉద్ఘాటించారు. యూనియన్ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగాప్రెస్‌క్లబ్ వద్ద యూనియన్ పతాకాన్ని రాష్ట్ర ప్రధానకార్యదర్శి కంచల జయరాజు ఆదివారం ఆవిష్కరించారు. ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, విజయవాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు రవి, వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి నాగరాజు, విజయభాస్కర్, రఘురాం, రామారావు, పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.





ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కొందరు మొక్కుబడుల మేరకు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. క్యూలైన్లలో చేరి అమ్మ కరుణ కోరుతూ ఆర్తితో దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా జరిగేందుకు అధికారులు, సిబ్బంది క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. ఈవో శీనానాయక్, అధికారులు ఆయా విభాగాలను సందర్శించి తగు సూచనలు చేసి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించారు. సిబ్బందికి సూచనలు చేశారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు.



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సూర్యోపాసన సేవ

ఆదివారం సందర్భంగా అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ సేవలను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి శోడశోపచార పూజలు నిర్వహించి, అర్చన పూర్తిచేసి మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందజేశారు.

108లో మహిళ ప్రసవం

● ఆగిరిపల్లి నుంచి విజయవాడ వస్తుండగా ఘటన

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరశివారు నున్నకు చెందిన 108లో శనివారం ఓ మహిళ ప్రసవించింది. ఆగిరిపల్లి ప్రాంతానికి చెందిన షేక్ మీరాభీ అనే మహిళకు ప్రసవ నొప్పులు రావడంతో నున్న 108కు సమాచారం అందించారు. ఈలోగా మహిళను 108కు ఎదురుగా తీసుకెళ్తే సమయం కలిసివస్తుందనే ఆలోచనతో అగిరిపల్లి నుంచి ఆటోలో తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న 108 వాహనం ఆగిరిపల్లి వైపు వెళ్లగా సూరంపల్లి అడ్డరోడ్డులో ఆటో ఎదురుకావడంతో సిబ్బంది అక్కడే మహిళను ఎక్కించుకున్నారు. విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రికి తీసుకువస్తుండగా అజిత్ సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ సమీపంలో ఆమెకు ప్రసవం జరిగింది. పండంటి మగబిడ్డకు జన్మకు జన్మనివ్వగా ఆమెను పాత ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది ఈఎం టీ వెంకయ్య, వాహన పైలెట్ బుచ్చిబాబు, కుటుంబ సభ్యులు మహిళకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రసవం చేశారు.



108 వాహనంలో జన్మించిన మగబిడ్డతో సిబ్బంది



సత్యనారాయణను శాలువా కప్పి సత్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న

కోగంటి బాబును కలిసిన బుద్దా వెంకన్న

వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కంచకచర్ల, వీరులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న కోగంటి సత్యనారాయణ (బాబు)ను ఆయన స్వగ్రామం పరిటాలలోని ఆయన నివాసంలో ఆదివారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న శాలువాతో కోగంటి బాబును సత్కరించి పుష్ప గుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ సీనియర్ నేతలు రామారావు, నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై సోలార్ ఫలకాలు అమర్చాలి

అజిత్‌సింగ్‌నగర్ : ప్రతి ఇంటిపై సోలార్ ఫలకాలు అమర్చి విద్యుత్ చార్జీల్లో మినహాయింపు పొందేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించాలని ఎమ్మెల్యే బొండా ఉమా తనయుడు బొండా సిద్ధార్థ్ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, తెలుగు యువత విభాగం నేతలతో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. నేతలు ఘంటా కృష్ణమోహన్, వింజమూరి సతీష్, కోలా దుర్గారావు, బెజ్జం జైపాల్, బాషా పాల్గొన్నారు.

నేటి నుంచి పీబీ సిద్దార్థలో తెలుగు కార్యశాల

విజయవాడ కల్చరల్ : మైసూరుకు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (భారతీయ భాషల సంస్థ), నేషనల్ టెస్టింగ్ సర్వీస్ - ఇండియా (జాతీయ పరీక్ష సేవాకేంద్రం), విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో తెలుగులో పరీక్ష మూల్యాంకనం, ప్రశ్నాంశ రచనపై ఆరు రోజుల శిక్షణ శిబిరం సోమవారం ఉదయం 10 గంటలకు పీబీ సిద్ధార్థ కాలేజీ సెమినార్ హాలులో ప్రారంభమవుతుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షతన జరిగే ఈ సభలో కార్యక్రమ ఉద్దేశ్యాన్ని సీఐఐఎల్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎం నారాయణరెడ్డి వివరిస్తారు. కళాశాల కన్వీనర్, సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలితప్రసాద్ ప్రారంభోన్యాసం చేస్తారు. సహాయాచార్యులు డాక్టర్ ఎన్ శివకుమార్ కీలక ఉపన్యాసం చేస్తారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సీనియర్ ఫెలో డాక్టర్ కే రవిబాబు పాల్గొంటారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కే బాలకృష్ణ, డాక్టర్ కే బాలకృష్ణ తెలుగు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు పాఠాలు బోధిస్తారు. ఈనెల 20 వరకు ముఖాముఖి విధానంలో ప్రత్యక్షంగా జరిగే ఈ కార్యక్రమం ఈనెల 21 నుంచి 23 వరకు ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతుంది.

కారు ఢీకొని ఒకరి మృతి

విద్యాధరపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనటంతో ఔట్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన మేరంగి శంకర్‌రావు (40) మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. మృతుడు భార్య రేణుక ఫిర్యాదు మేరకు ఆదివారం భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఔట్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన శంకర్‌రావు స్థానిక స్వాతి సెంటర్‌లోని ఓ చికెన్ షాపులో పనిచేస్తుండగా, అతడి భార్య రేణుక కూలిపనులు చేస్తూ కుమారుడు, కుమార్తెలను పోషించుకుంటున్నాడు. శనివారం రాత్రి చికెన్ షాపులో పని ముగించుకుని ఇంటికి చేరిన శంకర్‌రావు భోజనం చేసి 10.30 గంటలకు చికెన్ షాపునకు వెళుతున్నానని చెప్పి నడచుకుంటూ బయలుదేరాడు. రాత్రి 11.30 గంటలకు స్థానికులు ఆమె ఇంటికి వెళ్లి శంకర్‌రావు కారు ఢీకొనటంతో చనిపోయి ఉన్నాడని చెప్పారు. దీంతో ఆమె, బంధువులు సంఘటన ప్రాంతానికి వెళ్లి చూడగా ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ వైపునకు అతివేగంగా వెళుతున్న కారు శంకర్‌రావును ఢీకొనటంతో చనిపోయి రోడ్డుపై ఉన్నాడు. స్థానికులు కారు డ్రైవర్‌ను పట్టుకున్నారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ ఎండీ నిర్ణయాలపై ఈయూ హర్షం

బస్‌స్టేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్త్రీశక్తి పథకం విజయవంతం చేసేభాగంలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తీసుకున్న నిర్ణయాలపై ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్త్రీశక్తి పథకం అమలుతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతుందన్న ఉద్దేశంతో సిబ్బంది కొరత ఉన్నందున కండక్టర్, డ్రైవర్లకు కొన్ని ప్రత్యేక సదుపాయాలు ఎండీ కల్పించారన్నారు. ప్రస్తుతం డబుల్ డ్యూటీలు 8 గంటలు చేస్తున్న కండక్టర్లకు ఇచ్చే రూ.700ల మొత్తాన్ని రూ.900లకు పెంచారని, డ్రైవర్లకిచ్చే రూ.800లు రూ.1000లకు పెంచారని, అలాగే ఆన్‌కాల్ డ్రైవర్లకు వర్తించేటట్టు ఎండీ నిర్ణయం తీసుకున్నారన్నారు. స్త్రీ శక్తి పథకాన్ని సక్రమంగాఅమలు చేసేందుకు యూనియన్ తరపున సహకరిస్తామని వారు తెలిపారు.

టీడీపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల ఆందోళన

గాంధీనగర్, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో ఆయన అభిమానులు గాంధీనగర్‌లో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఫ్లెక్సీని చెప్పుల కొడుతూ దగ్ధం చేశారు. తారక్ బాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. తన కట్టే కాలే వరకు టీడీపీనే నా పార్టీ అని ఎన్టీఆర్ గతంలో ప్రకటించారని అభిమానులు గుర్తు చేశారు. కానీ కొంతమంది ఉచ్చనీచాలు మరచి తమ అభిమాన హీరోపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ అభిమానులు కూడా టీడీపీ ఓట్లు వేశారన్నారు. పార్టీకి అభిమానులకు మధ్య అంతరాలు పెంచవద్దని హెచ్చరించారు. ఎన్టీఆర్‌పై వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ప్రసాద్‌పై పార్టీ అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోవాలని లేదంటే తామే తగిన బుద్ధి చెప్తామన్నారు.

తెలుగు భాష ప్రాచీనతకు శాసనాలే ఆధారాలు

● ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ భాషల్లో తెలుగు ప్రాచీనమని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి హ్యూస్టన్‌లో నిర్వహించిన 14వ తెలుగు సాహితీ సదస్సులో ఆదివారం తెలుగు భాష ప్రాచీనతకు శాసనాలే ఆధారాలన్న అంశంపై ఆయన ప్రసంగించారు. సా.శ.పూ.3వ శతాబ్దికి చెందిన భట్టిప్రోలు రాతి బుద్ధదాతుపేటిక ప్రాకృత శాసనంలో ఉన్న అనేక వ్యక్తుల పేర్లు తెలుగులో ఉన్నాయని అవి శాసనాల్లోకి ఎక్కాయంటే అంతకు మునుపే ఆ భాష వాడుక భాషగా ఉండేదని, తద్వారా తెలుగు ప్రాచీనత ఇప్పటికే 2500 ఏళ్ల పూర్వానికి వెళుతుందన్నారు. ప్రముఖ సినీ మాటల రచయిత బుర్ర సాయి మాధవ్, తానా పూర్వ అధ్యక్షుడు డాక్టర్ తోటకూరి ప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త కాత్యాయనీ విద్మహే శివనాగిరెడ్డిని అభినందించారు. నిర్వాహకులు వంగూరి ఫౌండేషన్ ఛైర్మన్ వంగూరి చిట్టెంరాజు, హోస్టన్ తెలుగు సాహితీ సమితి అధ్యక్షుడు తిప్పిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి శివనాగిరెడ్డిని సత్కరించారు.



శివనాగిరెడ్డిని సత్కరిస్తున్న రాజు, కాత్యాయని విద్మహే

అన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా, తణుకుకు చెందిన కందుల లక్ష్మణరావు కుటుంబం రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. ఆయనతో పాటు సతీమణి విజయ వెంకట లక్ష్మి, కుమారుడు రామప్రసాద్, కోడలు శ్రీప్రభా చంద్ర, మనుమలు శ్రీయాన్స్, లక్ష్మణ అభిరాం, కుమార్తె లక్ష్మి సహస్ర పేర్ల మీద ఏఈవో వెంకటరెడ్డి ద్వారా విరాళాన్ని ఆలయానికి అందజేశారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

సత్యనారాయణపురం: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి సత్‌ప్రవర్తనతో మెలగాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే నగర బహిష్కరణ తప్పదని సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో, ఎస్సైలు షబ్బీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వన్‌టౌన్ : గొల్లపూడి టెలికం కాలనీలోని ఓ ఇంటిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి పదిమందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.67,300లు స్వాధీనం చేసుకుని భవానీపురం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి పరారయ్యాడు. టెలికం కాలనీలో నివాసం ఉంటున్న కోట్ల భాస్కరరావు తన భవనం పైనున్న పెంట్‌హౌస్‌లో కొన్ని రోజులుగా పేకాట నిర్వహిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులకు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ సీఐ సుబ్రహ్మణ్యం ఆ భవనంపై నిఘా పెట్టారు. ఆదివారం కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం తెలియటంతో సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ రాంబాబు తమ సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడిచేశారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్ : ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతానికి చెందిన బాలిక (17) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్ద ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన గౌతమ్ అలియాస్ పప్పు (22) అనే యువకుడు బాలికను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి పచారీ కొట్టుకు వెళ్లిన బాలిక వెంటపడి తనను ప్రేమించమని, పెళ్లి చేసుకుంటానని లేకుంటే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో అజిత్ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తుం

పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

గాంధీనగర్: పెన్షనర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నగరశాఖ సర్వసభ్య సమావేశం స్థానిక వాకర్స్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం సూర్యరావు, కేఎస్ హనుమంతరావు మాట్లాడారు. పీఆర్సీ బకాయిలను చెల్లించాలని, 12వ పీఆర్సీని వెంటనే నియమించాలన్నారు. ఏడీ నాగేశ్వరరావు, కే సాయిబాబు, పీ పుల్లారావు, కే రామచంద్రరావు, గిరిజ,పాల్గొన్నారు.



GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999 AJB-209467

EDUCATION

» PRABHAS COLLEGES, VJA: REGULAR/DIST/ONLINE: MBA, MCA, MA, M.Com, M.Sc., BCA, BBA, B.Sc., BA, ADMS. L.Dt.:10-8-2025. Ph: 99634 72800, 99634 72819, 94935 32525. AJB-81

FLAT FOR SALE

» 14 లక్షలకే మురళీనగర్‌లో 3వ ఫ్లోర్‌లో సింగిల్ బెడ్‌రూమ్ పెంట్‌హౌస్ బ్యాంక్ లోన్ సౌకర్యంతో అమ్మకం. సంప్ర: ✆ 93810 60509 AJB-209469

» 21 లక్షలకే గొల్లపూడిలో 600 Sft. 1st ఫ్లోర్ 2B/R తూర్పు ఫేస్ గ్రూప్ హౌస్, 24 లక్షలకే కేదారేశ్వరపేట 2 B/R గ్రూప్ హౌస్ అమ్మకం. సంప్ర. 93810 60509 AJB - 209475

TO-LET

» విజయవాడ, గాయత్రి నగర్, ఆచార్య రంగా వీధిలో 2 BHK ఫస్ట్ ఫ్లోర్, ఇండిపెండెంట్ హౌస్ అద్దెకు. సెల్ : 9246471857, 9848926691 AJB-235748

EDUCATION

» Admissions from 18th Aug into ANU Regular BA, BCom and BSc AI & CSc, Scholarships available for qualified. PLNM Degree College, Opp ANU, Cont: 9177408565, 9642656449 AJG-248618

» Distance Admissions: BA, BCom, BSc:CBZ, MPC, MStC, MPCs, PG Arts & Commerce Contact : 7997570408 AJG-248619

స్థలం అమ్మకము

» నేషనల్ హైవే ప్రక్కన కాజ నందు CRDA అప్రూవల్‌తో 200 గజాలు స్థలం ప్లాట్ నెంబర్ 81 అమ్మకానికి కలదు. ఫోన్ : 9491507198 AJG-248604

WANTED

» ప్యాకింగ్ బాయ్స్ & ఆఫీసు బాయ్స్ 30 సం.ల లోపు, మగవారు మాత్రమే. విజయవాడలో పనిచేయవలెను. సంప్రదించండి : సెల్: 93900 83900 AJB-6

» మురళీ రిసార్ట్స్ విజయవాడ నందు పనిచేయుటకు స్టాఫ్ కావలెను. హౌస్ కీపింగ్ ఎగ్జిక్యూటివ్స్ / సూపర్‌వైజర్, హౌస్ కీపింగ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్, ఎలక్ట్రీషియన్. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి : 7288885598 AJB-615

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి





ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

✆ పశ్చిమ: 99854 09286, సెంట్రల్: 99854 11733, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు

సర్క్యులేషన్ మేనేజర్ 9985411604, డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.505

మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీ శక్తి దోహదం: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు, ఆత్మగౌరవంతో బతికేందుకు స్త్రీ శక్తి పథకం దోహదపడుతుందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచితంగా బస్సులో ప్రయాణించే మహిళలు ఫ్రీ టికెట్‌తో సెల్ఫీ దిగి తమ ఆనందాన్ని పంచుకుంటూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన తెలిపారు. ఈ పథకం ఒకేసారి 2 కోట్ల 62 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చుతుందని పేర్కొన్నారు. ఉద్యోగాలు చేసుకునే మహిళలు, చదువుకునే బాలికలు, యువతులు, చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని స్పష్టంచేశారు.



విస్సన్నపేట సొసైటీ చైర్మన్ బదరీనాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

రైతులకు మెరుగైన సేవలందించండి

● పీఏసీఎస్ త్రిసభ్య కమిటీలకు

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచన

విస్సన్నపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించాలని పీఏసీఎస్ త్రిసభ్య కమిటీలకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం విస్సన్నపేట, కలగర పీఏసీఎస్‌ల చైర్మన్లు కంభంపాటి బదరీనాథ్, దొడ్డా నరసింహారెడ్డి(అన్నబాబు), సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కలగరలో నిర్మించిన నూతన సచివాలయం, రైతు సేవా కేంద్రాలను సర్పంచ్ దేశిరెడ్డి రమతో కలిసి ఆయన ప్రారంభించారు. సుపరిపాలనలో తొలి అడుగులో విస్సన్నపేట మండలం నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు టీడీపీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావును ఆయన అభినందించారు. చంద్రుపట్ల గ్రామానికి చెందిన మల్లవల్లి వెంకటేశ్వరరావు పార్టీ మండల కార్యాలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళంగా అందించారు. ఎన్నారై వల్లభనేని గిరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు నెక్కళపు వెంకటేశ్వరరావు(బద్దె), దుర్గగుడి డైరెక్టర్ గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కూటమి నేతలు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈవో, వీఆర్వోపై ఎమ్మెల్యే ఆగ్రహం

నూతన కార్యవర్గం పేర్లు నోటీస్ బోర్డుపై ఎందుకు రాయించలేదని విస్సన్నపేట పీఏసీఎస్ సీఈవో అంజనరావుపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు సరిగ్గా హాజరు కావడం లేదని, గ్రామస్థులకు అందుబాటులో ఉండడం లేదని కలగర వీఆర్వో జయరాజ్‌పైనా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

శేషాచల శ్రీనివాసుడికి ఎమ్మెల్యే పూజలు

గంపలగూడెం: పెనుగొలను శివారు మెట్టగుట్టలోని గజలక్ష్మీ సమేత శేషాచల శ్రీనివాసస్వామిని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, యోగానంద చార్యులు, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ పంది వెంకట్రావు, టీడీపీ నాయకులు మానుకొండ రామకృష్ణ, నాగళ్ల మురళి, నంబూరి శ్రీనివాసరావు, బురుగు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాలవాగు ఎత్తిపోతల పునఃప్రారంభం



మాలవాగు చెరువు లిఫ్టును పునఃప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

రెడ్డిగూడెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రెడ్డిగూడెంలోని మాలవాగుకు ఎన్ఎస్పీ కాలువపై 2014-19 మధ్య నిర్మించిన ఎత్తిపోతల పథకం (లిఫ్టు) పంపులను ఆదివారం నీటి సంఘం అధ్యక్షుడు కుమార్ రామారావు పునఃప్రారంభించారు. టీడీపీ హయాంలో నిర్మించిన ఈఎత్తిపోతల పథకాన్ని వైసీపీ హయాంలో పట్టించుకోకపోవడం వల్ల పంపులు మరమ్మతులకు గురవడంతో సమస్యను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి లిఫ్టు పనుల్ని పునఃప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండపల్లి బాబు, గనిపిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కోట డానియల్ మాదిగ

దివ్యాంగులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కోట డానియల్ మాదిగ డిమాండ్ చేశారు. శక్తినగర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమితి అధ్యక్షుడు ఎస్కే నూర్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెరిఫికేషన్ పేరుతో చాలా మంది దివ్యాంగుల పింఛన్‌ను ప్రభుత్వం నిలిపివేసిందని డానియల్ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రీ వెరిఫికేషన్ చేసి అర్హులందరికీ పింఛన్ పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు గంటేడి సుజాత నాయుడు, కటారపు మనోహర్ మాదిగ, కలకోటి బసవయ్య, పులి దిలీప్, బొమ్మనబోయిన రమేష్, గాలి మహాలక్ష్మి, ఐదుమల్ల సీత, వనమాల ఉత్తర పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రెడ్డిగూడెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రెడ్డిగుంట గ్రామానికి చెందిన సూర్య హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు ఆకుల సూర్యకిరణ్ ఆధ్వర్యంలో బూరుగగూడెం శ్రీరామా రైస్‌మిల్ ఆవరణలో నూజివీడు అమెరికన్ ఆస్పత్రి వైద్య బృందంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 400 మందికి వైద్య సేవలందించారు. టీడీపీ నాయకులు రామినేని వీరాస్వామి నాయుడు, రామినేని వివేక్, ఆకుల సుబ్రహ్మణ్యం, వైద్యుడు దత్తు, సిబ్బంది పాల్గొన్నారు.

950 మందికి వైద్య పరీక్షలు

తిరువూరు: ఆహార నియమాలు పాటించడంతో పాటుగా, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మధుమేహం, రక్తపోటు వ్యాధుల్ని అదుపులో ఉంచుకోవచ్చని వైద్యులు సూచించారు. ఆదివారం నాగార్జున హైస్కూల్‌లో పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో మధుమేహం, రక్తపోటు, ఫిట్స్ వ్యాధులకు 950 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. అవసరమైన వారికి తక్కువ ధరకు మందులు అందించారు.

కుంగిన రోడ్డు

● పైడూరుపాడు, కవులూరుకు నిలిచిన బస్సు
● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

(ఆంధ్రజ్యోతి-గొల్లపూడి): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలో రోడ్లన్నీ బాగుచేయిస్తోంది. అందులో భాగంగా ఎన్‌హెచ్ వద్ద ఉన్న నల్లకుంట నుంచి రాయనపాడు, పైడూరుపాడు, కవులూరు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిపై కొంతమేర మరమ్మతులు, కొంతమేర కొత్త రోడ్డును ఆరు నెలల క్రితం నిర్మించింది. అయితే ఈ రోడ్డుపై రాయనపాడు చెరువు కట్ట మధ్యలో ఆరు నెలల క్రితం ప్యాచ్ వర్క్‌లు చేసిన ప్రదేశంలో 300 మీటర్ల దూరం మూడు అడుగుల మేర రోడ్డు భూమిలోకి దిగబడిపోయింది. దీంతో పైడూరుపాడు, కవులూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సు రెండు రోజుల నుంచి నిలిచిపోయింది. కార్లు ఇతర వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. ఈ గ్రామాల ప్రజలు వైద్య, ఇతర అవసరాల కోసం బయటకు రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్లు తమ పని అయి పోయిందని సొమ్ము చేసుకుని చేతులు దులుపుకొంటున్నారని, కొన్నాళ్లకే రోడ్లు పాడైపోయి ఇబ్బంది పడుతున్నామని ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు కొత్త రోడ్ల నిర్మాణాలకు, మరమ్మతులకు మంచి కాంట్రాక్టర్లకు ఇచ్చి రోడ్ల నిర్మాణాలు చేపడితే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.



రాయనపూడి-పైడూరుపాడు రోడ్డుపై చెరువుకట్ట వద్ద మూడు అడుగుల లోతు కుంగిపోయిన రోడ్డు

అధికారుల పర్యవేక్షణా లోపమే..



మా ఊరి రోడ్డు ఎన్నిసార్లు వేసినా పాడైపోతోంది. కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారే కానీ సమస్య పరిష్కారం కావడం లేదు. అధికారుల పర్యవేక్షణా లోపం వల్లే రోడ్లు పాడవుతున్నాయి. సమస్యను గ్రామంలోని యువత అంతా కలిసి మంత్రి లోకేశ్ దృష్టికి వెళ్లే విధంగా సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తాం.

\- పెయ్యల వెంకటేశ్వరరావు, పైడూరుపాడు

చాలా ఇబ్బంది పడుతున్నాం



మూడు అడుగుల లోతున రోడ్డు కుంగిపోయింది. దీంతో మా గ్రామానికి ద్విచక్ర వాహనాలు తప్ప ఇతర వాహనాలు రావడం లేదు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి, రోజువారీ కూలీలు పనులకు వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

\-కుమ్మరి గోపాలకృష్ణ, పైడూరుపాడు



తమకు విద్య బోధించిన ఆచంట రవికుమార్ దంపతులను సత్కరిస్తున్న పెనుగొలను కోట మార్కండేయ జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు(పదో తరగతి 1990-95 బ్యాచ్)

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గంపలగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పెనుగొలను కోట మార్కండేయ జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల(పదో తరగతి 1990-95 బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. అప్పుడు చదువు చెప్పిన ఆచంట రవికుమార్ దంపతుల్ని సత్కరించారు. ఇటీవల ఇంటర్నేషనల్ సౌత్ ఏషియన్ గేమ్స్‌లో లాంగ్ జంప్, షార్ట్‌పుట్, డిస్కత్రో పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించిన రాళ్లచర్ల రమణయ్యను సత్కరించారు. హెచ్ఎం ఎం.క్రిష్టపర్, సాయిబాబా కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు, ఎస్ఎంసీ అధ్యక్షుడు ఆదూరి ఆంజనేయులు, సంగేపు దేవసహాయం పాల్గొన్నారు.

నేడు సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

తిరువూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని బైపాస్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. ఉదయం 9 గంటలకు సినీ నటుడు సుమన్ ఆవిష్కరించనున్నారు.

సూపర్ స్పీడుగా సూపర్‌సిక్స్

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను సూపర్ స్పీడుగా అమలు చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా, ఆర్థిక భారం పడినా మహిళందరికీ ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు ప్రయాణం(స్త్రీ శక్తి పథకం)అమలు చేశారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం అందించారని తెలిపారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నారని, అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం పెడుతున్నారని అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వంపై ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ప్రతీ ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడంతో ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలంటున్నారని ఆయన స్పష్టం చేశారు.

దొంగతనానికి యత్నించిన యువకుడి అరెస్టు

మైలవరంరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మైలవరం ఎస్వీఎస్ నగర్‌లోని ఓ ఇంట్లో దొంగతనానికి ప్రయత్నించిన బట్టా వెంకటకిషోర్ అనే యువకుడిని ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. ఈనెల 15న అర్ధరాత్రి సమయంలో వసంతరెడ్డి ఇంట్లోకి వెంకటకిషోర్ ప్రవేశించాడని తెలిపారు. సీసీ కెమెరాలు తొలగించడంతోపాటు కారు అద్దాలను పగులగొట్టాడని, ఇంతలో ఎవరో వస్తున్నారనుకుని చోరీ చేయకుండా వెళ్లిపోయాడని తెలిపారు. వసంతరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, సీసీ ఫుటేజీ ఆధారంగా వెంకట కిషోర్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రెడ్డిగూడెం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసాన్ని పురస్కరించుకొని రుద్రవరం గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండుతాయని కోరుకున్నారు.



గ్రామదేవత ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న రుద్రవరం గ్రామస్థులు

సత్ప్రవర్తనతో మెలగండి

● రౌడీషీటర్లకు ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ కౌన్సెలింగ్



మాట్లాడుతున్న ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ

తిరువూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): 'వివాదాలకు దూరంగా ఉండండి. మీ పనులు చేసుకుంటూ ప్రశాంతంగా జీవించండి. సత్ప్రవర్తనతో మెలగండి.' అని స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చారు. కొందరు ముందస్తు అనుమతి లేకుండా కౌన్సెలింగ్‌కు గైర్హాజరవ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా కౌన్సెలింగ్‌కు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై-2 వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మండల కార్యాలయం
నిర్మాణ పనుల పరిశీలన

విస్సన్నపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పుట్రేల రోడ్డులో రాజా కాటా వెనుక నిర్మిస్తున్న టీడీపీ మండల కార్యాలయ భవనం నిర్మాణ పనులను ఎన్నారై, పార్టీ నియోజకవర్గ నేత వల్లభనేని గిరిబాబు ఆదివారం పరిశీలించారు. త్వరతగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, దుర్గగుడి డైరెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు(బుడ్డయ్య) ఏఎంసీ డైరెక్టర్ పల్లపాము రాంబాబు, పట్టణ అధ్యక్షుడు కొండల శ్రీవాసరావు, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో ఆహారం అందజేత

తిరువూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏపీడబ్ల్యూజే యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మ పేమాశ్రమం, రమణ మహర్షి ఆశ్రమాల వద్ద కేక్‌లు కట్‌చేసి, ఆశ్రమంలోని వృద్ధులకు, దివ్యాంగులకు న్యాయవాది రావూరి నాగరాజు, డాక్యుమెంట్ రైటర్ ఆర్.నాగమయి సహకారంతో ఆహారం అందించారు. పలువురు విలేకర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు అమలు చేయాలి: ఐఎఫ్‌టీయూ

జి.కొండూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల కుమార్ డిమాండ్ చేశారు. జి.కొండూరులో ఆదివారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల బారిన పడిన కార్మికులకు సంక్షేమబోర్డు నుంచి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్కే సుభాని, ఎస్కే చాన్‌బాషా, ఎస్కే మీరావలి పాల్గొన్నారు.



19న విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించే ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు



జి.కొండూరులో కొత్తూరు గొల్లగూడెం వెళ్లే రోడ్డులో కృష్ణా జలాల పైపులైన్‌కు లీకు కారణంగా వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

(ఆంధ్రజ్యోతి-జి.కొండూరు): జి.కొండూరులో పులివాగు వంతెన పక్కన కొత్తూరు గొల్లగూడెం వెళ్లే రహదారిలో కృష్ణా జలాల పైపులైన్‌కు లీక్ ఏర్పడి ఏడాది నుంచి లక్షల లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. అయినా ఏ అధికారికీ ఇది పట్టడం లేదు. కళ్ల ముందు పెద్ద లీకు ఏర్పడి తాగునీరు వృథాగా పోతున్నా చూసీచూడనట్లు ఉంటున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తక్షణం లీకును సరి చేయించి తాగునీరు వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

లీకును సరిచేస్తాం


రహదారి పక్కన ఏర్పడి లీకును సరి చేసేందుకు దాని పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభం అడ్డుగా ఉంది. విద్యుత్‌శాఖ అధికారులను కలిసి, సరఫరా నిలుపుదల చేసి, లీకును సరి చేస్తాం.

\- నవీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఇద్దరు యూట్యూబ్ విలేకరులపై కేసు

మైలవరంరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నావని బెదిరించి ఓ మహిళ వద్ద నుంచి రూ.20 వేలు వసూలు చేసిన ఇద్దరు యూట్యూబ్ విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సుధాకర్ ఆదివారం తెలిపారు. 'మండలంలోని జంగాలపల్లికి చెందిన వీరిశెట్టి రుక్మిణి ఇంటికి పొందుగలకు చెందిన అశోక్, మైలవరానికి చెందిన ప్రకాష్ వచ్చారు. తాము యూట్యూబ్ విలేకరులమని మీ ఇంట్లో రేషన్ బియ్యం ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. పోలీసులకు పట్టిస్తామని ఆమెను బెదిరించారు. తాను బియ్యం వ్యాపారం చేయడం లేదని చెప్పినా వినలేదు. ఆమెను బెదిరించి రూ.20 వేలు వసూలు చేశారు. అందులో రూ.8 వేలు ఫోన్‌పే ద్వారా, మరో రూ. 12 వేలు నగదుగా తీసుకున్నారు. దీనిపై రుక్మిణి శనివారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఇద్దరు యూ ట్యూబ్ విలేకరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం'. అని ఎ స్సై తెలిపారు.





ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999
AJB-209467

EDUCATION

» PRABHAS COLLEGES, VJA: REGULAR/DIST/ONLINE: MBA, MCA, MA, M.Com, M.Sc., BCA, BBA, B.Sc., BA, ADMS. L.Dt.:10-8-2025. Ph: 99634 72800, 99634 72819, 94935 32525.
AJB-81

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 220/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331.
మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464
తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609
మైలవరం : 99854 85777, 99854 09286
నూజివీడు : 99854 02464, నందిగామ : 99854 11620
తిరువూరు : 98498 25565, జగ్గయ్యపేట : 8919466168

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.505



సత్తెమ్మ తల్లికి సారె సమర్పణ

జగ్గయ్యపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్టీసీ కాలనీలోని శ్రీసత్తెమ్మ అమ్మవారికి ఆ ప్రాంతానికి చెందిన మహిళలు బోనాలు సమర్పించారు. ప్రభ బండి కట్టుకుని సాంప్రదాయబద్ధంగా భక్తులు శోభాయాత్రగా తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు, పూలతో సారె సమర్పించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు.



సత్తెమ్మ అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

నందిగామ రహదారి అధ్వానం

- పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం
- అడుగడుగునా గోతులు.. వాహనదారుల పాట్లు
- కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- మండిపడుతున్న వాహనదారులు

నందిగామ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. అడుగడుగునా టోల్ వసూలు చేస్తున్న జాతీయ రహదారుల సంస్థ ఆమేర సౌకర్యాల కల్పనపై శ్రద్ధ చూపడం లేదు. నందిగామ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులలో జరుగుతున్న జాప్యంతో వంద మీటర్ల దూరం ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బైపాస్ విస్తరణ పనులను గుత్తేదారులు ఆకస్మికంగా నిలిపివేశారు. కొద్దిపాటి పనులు మాత్రమే మిగిలిఉన్న సమయంలో ప్రధాన గుత్తేదారుడికి, సబ్ కాంట్రాక్టర్‌కు మధ్య సమన్వయలోపం వల్ల పనులు నిలిచిపోయాయి. దీంతో విజయవాడ నుండి నందిగామ వైపు వస్తున్న ప్రయాణీకులు సర్వీస్ రోడ్డులో పెద్దపెద్ద గతుకులు ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సదరు వంద మీటర్లు ప్రయాణించేందుకు అల్లాడిపోతున్నారు. వాహనాలు దెబ్బతినడంతో పాటు వాహనంలో ప్రయాణించేవారి ఒళ్లు గుల్లైపోతుంది. ఈ పరిస్థితిపై వాహనదారులు పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరూ స్పందించలేదు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వారం రోజులుగా భారీ వర్షాలు పడుతుండడంతో గుంతలో నీరు నిలబడుతున్నాయి.

దీంతో ఆరోడ్డుపై ప్రయాణం మరింత జఠిలమైంది. ఆదివారం సాయంత్రం గుంతలలో పడి వాహనాలు ఆగిపోవడంతో అక్కడ భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు మూడు కిలోమీటర్లమేర వాహనాలు నిలిచిపోయాయి. ఒకవైపు వర్షం, మరోవైపు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. అడుగడుగునా టోల్ వసూలు చేస్తున్న సదరు సంస్థ సౌక ర్యాలు ఎందుకు కల్పించదని వాహనదారులు మండిపడుతున్నారు.



రోడ్డు అధ్వానంగా ఉండడంతో నిలిచిపోయిన వాహనాలు



లింగాల కాజ్‌వే వద్ద మునేరును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ లక్ష్మీశ

వత్సవాయి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): లింగాల కాజ్‌వే వద్ద మునేరు ప్రవాహాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. కృష్ణా, బుడమేరు, మునేరు, కట్లేరు, పాలేరుల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ముఖ్యంగా మునేరుకు ఎదురుగా ఉన్న తెలంగాణ జిల్లాల్లో కురుస్తున్న వర్షాల వల్ల మునేరుకు వరద పోటెత్తుందన్నారు. కృష్ణానదిలో 2.8 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుందని, ఎలాంటి ప్రమాదం లేదన్నారు. జిల్లా అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నామన్నారు. నదీ పరివాహక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అధికారులకు తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దార్ వెంక టేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ జి.వి.రఘు, ఏఈ రామనరసింహారావు, ఎంపీడీవో నితిన్, పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

- మొక్కులు, బోనాలు సమర్పించుకున్న భక్తులు

జగ్గయ్యపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ఆఖరి ఆది వారం కావటంతో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు, మొక్కులు సమర్పించేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆదివారం ఉద యం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, మొక్కులు చెల్లించేం దుకు తరలి రావటంతో దేవస్థానం కిటకిట లాడింది. మధ్యాహ్నం వరకు రద్దీ కొనసాగింది. దేవస్థానం కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

ముత్యాలమ్మకు పూలంగి సేవ

జగ్గయ్యపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చెరువుబజార్‌లో వేంచేసియున్న గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారికి పూలంగి సేవ నిర్వహించారు. కుమ్మరి శాలి వాహన సంఘీయులు అమ్మవారికి దేవస్థానం కమిటీ, భక్తులు సమర్పించిన వివిధరకాల పుష్పాలు, పూలమాలలతో గర్భాలయంతో అమ్మవార్లను శోభాయ మానంగా అలం కరించారు. అంతకుముందు అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. దేవస్థానం కమిటీ సభ్యులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, నోముల శివకుమార్, కొంకిమళ్ల సురేష్, దేవరశెట్టి నాగప్రసాద్ ఇతర సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు.



వైద్య శిబిరంలో 653 మందికి పరీక్షలు

జగ్గయ్యపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత రెండు రోజులగా బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జయప్రద ఫౌండేషన్ నిర్వహించిన వైద్య శిబిరంలో 653 మంది వైద్య సేవలు ఉపయోగించుకున్నారు. 383 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 277 మందికి కళ్లజోళ్లు, 48 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. సాధారణ వ్యాధులకు 232 మంది, దంత సమస్యలపై 38 మందికి పరీక్షలు చేశామని శిబిరం కో.ఆర్డినేటర్ కట్టా నరసింహారావు కోరారు. సోమవారం పట్టణంలో ఆర్టీసీ కాలనీలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద ఆ ప్రాంత ప్రజల కోసం క్యాంపు నిర్వహిస్తామని జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండెపు దశరథ జనార్ధన్ చెప్పారు.

మునేటికి .. భారీగా చేరిన వరద

పెనుగంచిప్రోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో కురిసిన భారీ వర్షాల వలన పెనుగంచిప్రోలు మునేటికి శనివారం రాత్రి వరద భారీగా చేరుకుంది. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎ.శాంతి లక్ష్మీ శనివారం అర్ధరాత్రి వరకు మునేటి కాజ్‌వే వద్దనే ఉండి పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మున్నేరుకు ఆదివారం తెల్లవారు జామున ఐదు గంటలకు 28,551 క్యూసెక్కుల వరద వచ్చింది. 28,341 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ తర్వాత గంట గంటలకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. రాత్రి ఏడు గంటలకు 6,966 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 6,654 క్యూసెక్కులుగా ఉంది.



నిండుకుండలా ఉన్న మునేటి కాలువ వద్ద వరద

మఠం శివాలయం నిర్మాణానికి విరాళాలు

జగ్గయ్యపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాలేటి ఒడ్డున పునర్నిర్మిస్తున్న మఠం శివాలయం నిర్మాణానికి మిర్యాల సంతోష్‌కుమార్, ప్రియాంక దంపతులు రూ.11,116లు, సిద్దంశెట్టి భాస్కరరావు, గోపీనాధ్‌లు రూ.11,116లు ఆదివారం విరాళంగా అందజేశారు. దాతలకు మఠం ట్రస్టు ప్రతినిధులు స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

వత్సవాయి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మంగొల్లులో సీతారామచంద్రస్వామి నూతన ఆలయ నిర్మాణంకు ఆదివారం దైవజ్ఞులు గురుస్వామి పరిమి సుబ్రహ్మణ్యం, తాండ్ర పవన్‌కుమార్ శర్మ (పురోహితుడు), వేమవరపు శివ శరణ్‌శర్మ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు మన్నె నారాయణ, బొల్లం పురుషోత్తం, పొందూరి వెంకట నారాయణ, శీలం నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాగాణి పనుల్లో రైతులు బిజీబిజీ

- తుఫాన్ హెచ్చరికలే ఆందోళనలు కలిగిస్తున్నాయంటున్న రైతులు
- సాగుకు చిల్లిగవ్వ లేక కౌలు రైతుల అవస్థలు

నందిగామ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మాగాణి సాగు పనులలో రైతులు నిమగ్న మయ్యారు. ఒకపక్క సాగర్ జలాలు వస్తుండటంతో పనులను మరింత వేగ వంతం చేస్తున్నారు. ఇప్పటికే నారు మడులు సిద్ధంగా ఉండటంతో పొలాలను దున్ను తున్నారు. మరో వారం, పది రోజుల్లో నాట్లు పడతాయని, కానీ వాతావరణ శాఖాధికారులు చేస్తున్న తుఫాన్ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయని రైతులు అంటున్నారు. మండలంలో సుమారు ఐదు వేల ఎకరాలలో మాగాణి సాగు చేపడుతున్న వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ నగదు మూడు దశల్లో పడతాయని చెబుతున్నారని, కౌలు రైతులకు ఇప్పటికీ నగదు జమ కాలేదని రైతులు వాపోతున్నారు. సాగుకు చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు పడుతున్నామని అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని సాగు చేస్తున్నామని తుఫాన్ కారణంగా వరదలు, వర్షాలు వస్తే మరోసారి నష్టాలు తప్పవని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.



ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేదాద్రి గ్రామానికి చెందిన షేక్ సాయిబి తన భర్త మక్కోజి కనిపించటం లేదని ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామంలో వెల్డింగ్ పనులు నిర్వహించుకునే తన భర్త ఈ నెల 12న రాత్రి ఏడు గంటల సమయంలో కూరగాయలు తీసుకు వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదని రెండు రోజులుగా బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవటంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.





పెనుగంచిప్రోలు - ముండ్లపాడు రహదారి దారుణం

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- కనీస మరమ్మతులైనా చేపట్టండి
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

పెనుగంచిప్రోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు పెనుగంచి ప్రోలు రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఈ రహదారికి కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో ఈ రహదారి చాలాచోట్ల గోతలమయంగా మారింది విజయవాడ వైపు నుంచి శ్రీ తిరుపతమ్మ దర్శనార్థం నిత్యం పలు వాహనాల్లో పెనుగంచిప్రోలుకు వస్తుంటారు ఈ రహదారిలో చాలా చోట్ల గోతులు పెద్దగా ఏర్పడతంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవు తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి ఈరహదారికి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న పెనుగంచిప్రోలు - ముండ్లపాడు రహదారి

శతవత్సరాల సంబరాల శిక్షణకు బెజవాడ తరలిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

జగ్గయ్యపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది విజయదశమి పర్వదినం నుంచి సంవత్సరం పాటు నిర్వహించనున్న ఆర్ఎస్ఎస్ శతవత్సరాల ఉత్సవాలపై చర్చించేందుకు జగ్గయ్యపేట నుంచి ఆర్ఎస్ఎస్ ముఖ్యనేతలు ఆదివారం విజయవాడ తరలివెళ్లారు. విజయవాడలో శతవత్సరాల కార్య క్రమాలపై శిక్షణలో పాల్గొన్నారు. పట్టణంలో ఇటీవల పలుబస్తీల్లో ఆర్ఎస్ఎస్ శాఖలను ఏర్పాటు చేసి కార్యకలాపాలను విస్తరించిన విషయాన్ని ఆర్ఎస్ఎస్ బాధ్యులు ఆర్ఎస్ఎస్ ముఖ్యనేతలకు వివరించారు.

ధన్వంతరీ నారాయణ మూలమంత్ర హోమం

జగ్గయ్యపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రామచంద్రునిపేట గ్రామంలో శ్రీకృష్ణుడు దేవాలయం సమీపంలో తోటలో శ్రావణమాసం సందర్భంగా సౌర అరుణ మహా పారాయణ, సూర్య నమస్కారం,సామూహిక ఆదిత్య హృదయ ధన్వంతరి నారాయణ మూల మంత్రజప తర్పణ హోమ మహోత్సవాన్ని నిర్వహించారు. కోదాడకు చెందిన వేద పండితులు వంగీపురం పవన్‌కుమారాచార్యులు ఆధ్వర్యంలో శ్రీగణేష్ ఆయుర్వేద వన మూలిక అధ్యాత్మిక కేంద్రం వారి సహకారంతో నిర్వహించారు. జగ్గయ్యపేట, కోదాడ పట్టణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.25 వేల విరాళం

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రాసమంద్రి శంకర్, లక్ష్మీ దంపతులు రూ. 25,116లు విరాళంగా అందించారని ఆలయ ఏసీ సాంబశివరావు తెలిపారు.

పూజల అనంతరం దాతలకు స్వామి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు నేడు

నందిగామ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీ కానుకలు లెక్కిస్తున్నట్లు ఈవో సురేష్, అనువంశిక ధర్మకర్త రాఘవకుమార్ ఆదివారం తెలిపారు. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఆసక్తికలిగిన భక్తులు పాల్గొనాలని కోరారు.

తిరుపతమ్మకు బోనాల సమర్పణ

పెనుగంచిప్రోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆదివారం ఉదయం నుండి తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో పెద్ద ఎత్తున బారులుతీరారు. అమ్మవారిని అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ బిహెచ్‌విఎస్ఎన్ కిషోర్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు.

చినుకు పడితే గజగజ

- కొద్దిపాటి వర్షానికే పొంగుతున్న వాగులు
- వంతెనలు నిర్మించాలన్న గ్రామస్తుల కల నెరవేరేనా?

కంచికచర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చెవిటికల్లు గ్రామస్తులు గజగజ వణికి పోతున్నారు. కొద్దిపాటి వర్షానికి వాగులు పొంగుతుండటంతో గ్రామం నుంచి బయటకు రావటానికి వీలుపడటం లేదు. వంతెనలు నిర్మించాలన్న గ్రామస్తుల కోరిక మాత్రం దశాబ్ధాలు గడుస్తున్నప్పటికీ ఫలించటం లేదు. కంచికచర్ల మండలంలో కృష్ణానది తీర గ్రామాల్లో ముఖ్యమైనది చెవిటికల్లు గ్రామం. కంచికచర్ల నుంచి ఈ గ్రామానికి ఆర్అండ్‌బీ రోడ్డు సదుపాయం ఉంది, అయితే గ్రామం ముంగిట రెండు వాగులున్నాయి. కంచికచర్ల బైపాస్ వద్ద మరో వాగు ఉంది. చినుకుపడటమే ఆలస్యమన్నట్టుగా ఈ వాగులు పొంగుతున్నాయి. ఐదారు అడుగుల ఎత్తున పొంగుతుండటంతో చెవిటికల్లు గ్రామస్తులు బయటకు రావటానికి వీలుపడటం లేదు.

బైపాస్ వద్ద వాగు పొంగుతుండటంతో కంచికచర్ల నుంచి కూడా ఈ మార్గంలో రాకపోకలు నిలిచి పోతున్నాయి. దీంతో చెవిటికల్లుతో పాటుగా కునికినపాడు, మున్నలూరు, గనిఆత్కూరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం ముందున్న వాగుల వల్ల ఇంతకు ముందు ప్రమాదాలు జరిగాయి. ఒక బాలిక కూడా మృతి చెందింది. కృష్ణానదికి వరద పోటెత్తిన సమయంలో ముఖ్యంగా ఈ గ్రామం ద్వీపంగా మారుతుంది. ఇళ్లల్లో నుంచి కాలు బయట పెట్టటానికి కూడా అవకాశం లేకుండా పోతుంది. వాగులపై వంతెనలు నిర్మించాలని గ్రామస్తులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. పాలకులు వాగ్దానాలు చేస్తున్నారు తప్పితే కార్యరూపం దాల్చటంలేదు. గ్రామస్తుల కోరిక మాత్రం నెరవేరటం లేదు. వర్షాకాలంలో రోజుల తరబడి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నందున తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యుద్ధప్రాతిపదికపై వంతెనలు నిర్మించాల్సిందిగా గ్రామస్తులు ముక్తకంఠంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



చెవిటికల్లు గ్రామంలో పొంగుతున్న లక్ష్మయ్య వాగు



GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999 AJB-209467

EDUCATION

» PRABHAS COLLEGES, VJA: REGULAR/DIST/ ONLINE: MBA, MCA, MA, M.Com, M.Sc., BCA, BBA, B.Sc., BA, ADMS. L.Dt.:10-8-2025. Ph: 99634 72800, 99634 72819, 94935 32525. AJB-81

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు. చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడి విటి



WALK - IN - INTERVIEW

ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకులకోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు. కాబట్టి అర్హత కలవారు ఇంటర్వ్యూకు హాజరుకాగలరు.

ఆంధ్రజ్యోతి

డివిజన్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ (SR)

జగ్గయ్యపేట

అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చే విధంగా పని చేయవలసి ఉంటుంది.

అభ్యర్థి కనీస అర్హత ఇంటర్ మరియు సేల్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండవలెను.

అర్హత, అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును.

పత్రికారంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

పై అర్హతలు గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో ఇంటర్వ్యూకు హాజరుకాగలరు.

ఇంటర్వ్యూ తేది: **18-08-2025** ఉ॥10 నుండి సా॥5 గంటల వరకు

ఇంటర్వ్యూ జరుగు ప్రదేశము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్

రామవరప్పాడు 2వ ఫ్లై ఓవర్ దిగి కిలోమీటరు ముస్తాబాద రోడ్డులో కి రావలెను.

సెల్ : 99854 11604

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

✆ 99854 85777, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు

✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,

డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234